


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   శుక్రవారం 27-01-2023   సంపుటి : 04   సంచిక : 136   పేజీలు : 4   వెల : రూ 3-00


# సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం జరుగలేదు

## ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



అమరావతి జనవరి 26 సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం అంటున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఏ ఆధారాలతో అంటున్నారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. గెస్ట్ ఆర్టిస్ట్‌లా వచ్చి చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదివి వెళ్తారని విమర్శించారు. సబ్‌ప్లాన్ కంటే ఎక్కువగా నిధులు అందిస్తున్నామన్నారు. చంద్రబాబు ఐదేళ్లలో రూ. 33 వేల కోట్లు ఖర్చు చేశారని... జగన్ మూడేళ్లలో రూ. 48 వేల కోట్లు నిధులు ఇచ్చారని చెప్పుకొచ్చారు. పొలిటికల్‌గా, పదవులు పరంగా ఎస్సీ, ఎస్టీలకు జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సకల శాఖల మంత్రి అని పవన్ తనపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. టార్గెట్‌గా చేసుకుని ప్రజల్లో ఏదో క్రియేట్ చెయ్యడానికి ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. పొత్తుల గురించి పవన్ చెప్పిన మూడు ఆప్షన్స్ నవ్వొస్తోందన్నారు. ఏవీ లేకుండా చంద్రబాబుకి సపోర్టు చెయ్యడం అనే నాలుగో ఆప్షన్ కూడా చెప్పాల్సింది అంటూ ఆయన యెద్దేవా చేశారు.గత రెండు ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా పవన్ రిమోట్ చంద్రబాబు చేతుల్లోనే ఉంటుందన్నారు. లోకేష్ పాదయాత్రను టీడీపీ ఎక్కువగా ఊహించుకుంటోందన్నారు. జగన్ పాదయాత్ర చేసినప్పుడు ఉన్న నిబంధనలే ఇప్పుడు ఉన్నాయని.. జగన్ ఆంక్షలకు లోబడే పాదయాత్ర చేశారని.. ఆంక్షలు పెట్టారని గగ్గోలు పెట్టలేదని గుర్తుచేశారు. కందుకూరు ఘటనతో రోడ్లపై సభలు నిషేధం నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. లోకేష్, పవన్, చంద్రబాబులలో సీఎం అభ్యర్థి ఎవరో ప్రజలకు చెప్పాలన్నారు. వైసీపీ అంటే జగన్.. జగన్ అంటే వైసీపీ అని తాము స్పష్టంగా ఉన్నామని... తమరెందుకు స్పష్టంగా చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. విడివిడిగా వచ్చినా.. కలిసి వచ్చినా తమకు ఒకే అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

# ఏపిలో ఘనంగా గణతంత్ర వేడుకలు

## ఇందిరాగాంధీ స్టేడియంలో జెండా ఆవిష్కరించిన గవర్నర్
## నాడు-నేడు అభివృద్ధి..నవరత్నాల పురోగతిపై ఫోకస్
## వేడుకల్లో పాల్గొన్న సిఎం జగన్



విజయవాడ,జనవరి26 : ఆంధ్రప్రదేశ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాల్గన్నారు. గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. వేడుకల సందర్భంగా పరేడ్‌లో నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వివిధ శాఖల శకటాలను పరేడ్‌లో ప్రదర్శించారు. గణతంత్ర వేడుకల్లో గవర్నర్ ప్రసంగిస్తూ...'నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి జరిగింది. నవరత్నాల పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం, విద్యా కానుక ద్వారా ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులకు సాయం అందిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక రంగానికి వెన్నెముక.. వ్యవసాయం. రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రైతు కుటుంబాలకు ఏటా రూ.13,500 సాయం చేస్తున్నామని తెలిపారు. 37 లక్షల మంది రైతులకు వైఎస్సార్ పంటల బీమా అందిస్తున్నామని గవర్నర్ హరిచందన్ తెలిపారు. అయితే గవర్నర్ స్పీచ్‌లో పొరపాట్లు దొర్లాయి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కింద లబ్ది విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు అంటూ ప్రస్తావించిన గవర్నర్... ఆ వెంటనే గుడ్ గవర్నెన్స్ కింద 13 జిల్లాలను 26 జిల్లాలకు పెంచామని వెల్లడించారు. అక్కడి నుండే పాలన సాగుతోందని తెలిపారు. ఈ లెక్కన ఉత్తరాంధ్రలో ఆరు జిల్లాలకు బదులు మూడు జిల్లాలంటూ గవర్నర్‌తో ప్రభుత్వం చెప్పించినట్లైంది. స్పీచ్ ప్రిపరేషన్‌లో దొర్లిన పొరపాట్లపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నారా లోకేశ్



తిరుమల: తిరుమల శ్రీవారిని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దర్శించుకున్నారు. రేపటి నుంచి 'యువగళం' పాదయాత్ర ప్రారంభించనున్న నేపథ్యంలో స్వామి వారి దర్శనం చేసుకున్నారు.లోకేశ్ తిరుమల రాక సందర్భంగా పెద్ద ఎత్తున తెదేపా నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు.లోకేశ్ తిరుమల నుంచి నేరుగా కుప్పం వెళ్లనున్నారు. రేపు ఉదయం అక్కడి శ్రీవరదరాజస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 'యువగళం' పాదయాత్రను ప్రారంభిస్తారు. మరోవైపు పాదయాత్రకు తెదేపా నేతలు ఏర్పాట్లు పూర్తిచేశారు.

# ఏపీలో ఘనంగా గణతంత్ర వేడుకలు..

## ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన



విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన వేడులల్లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాల్గొన్నారు.జాతీయ జెండాను గవర్నర్ ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. వేడుకల సందర్భంగా పరేడ్‌లో నిర్వహించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వివిధ శాఖల శకటాలను పరేడ్‌లో ప్రదర్శించారు.

# మరోమారు వేర్పాటు అంటే నేనేంటో చూపిస్తా

## విభజన వాదుల నా సత్తా ఏంటో చూపుతా
## ఇప్పటికే మీరు చేసిన విభజన రాజకీయాలు చాలు
## వేర్పాటువాద ధోరణితో మాట్లాడితే నాలాంటి తీవ్రవాదిని చూడరు
## గణతంత్ర వేడుకల్లో ఘాటుగా హెచ్చరించిన జనసేనాని






గుంటూరు,జనవరి26: వేర్పాటువాద ధోరణితో రాష్ట్రాన్ని, ప్రజల్ని విడగొట్టింది చాలు.. ఇక ఆపేయండి' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక రాష్ట్రాలు కావాలంటూ ఇటీవల కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఈ సందర్భంగా పవన్ నిప్పులు చెరిగారు. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రిపబ్లిక్ డే రోజున చెప్తున్నా.. ఏపీకి చెందిన నేతలు వేర్పాటువాద ధోరణితో మాట్లాడితే నాలాంటి తీవ్రవాదిని ఇంకోసారి చూడరు. విసిగిపోయాం.. మీ బతుకులకేం తెలుసు? కాన్‌స్టిట్యూషన్ అసెంబ్లీ డిబేట్స్ చదివారా? అవినీతిలో మునిగిపోయిన.. పబ్లిక్ పాలసీ తెలియని మీరు రాష్ట్రాన్ని విడగొట్టేస్తారా? మేం చూస్తూ కూర్చొంటామా? మేం దేశ భక్తులం.. ఆంధ్రప్రదేశ్‌ను ఇంకోసారి విడగొడతామంటే తోలుతీసి కింద కూర్చోబెడతాం. తమాషాగా ఉందా..ఎంతమంది సీఎంలు రాయలసీమ నుంచి వచ్చారు? ఆ ప్రాంతానికేం చేశారు?అక్కడ నుంచి వలసలు ఎందుకు ఆపలేకపోయారు?ఉత్తరాంధ్ర రాష్ట్రం కావాలా? వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కోసం తెలంగాణకు చెందిన జగిత్యాలలో సాయిరెడ్డి చనిపోయారు.. గుంటూరులో హబీబుల్లా మస్తాన్ మరణించారు. ఆ సంగతి మీకు తెలుసా? మీ స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా స్టేట్‌మెంట్లు ఇవ్వొద్దు. చాలు.. రాష్ట్రాన్ని ప్రజల్ని విడగొట్టింది చాలు.. ఇక ఆపేయండి' అని పవన్ వ్యాఖ్యానించారు. వేర్పాటువాద ధోరణితో ఎవరైనా మాట్లాడితే తనలాంటి తీవ్రవాదిని ఇంకోసారి చూడరని పవన్ హెచ్చరించారు. ప్రజల కోసమే జనసేన కార్యాలయమన్న పవన్.. జనానికి ఏ సమస్య వచ్చినా పార్టీ ఆఫీస్‌కు రావచ్చని అన్నారు. పార్టీలతో పొత్తులపై పరోక్షంగా స్పందించిన పవన్... ప్రజల అవసరాలకు అనుగుణంగా తాను మారుతానని, తన విధానాలను మార్చుకుంటానని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తాజా రాజకీయాలపై రిపబ్లిక్ డే ప్రసంగంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు . ముఖ్యంగా కోడికత్తి రాజకీయాలతో సీఎం కానని.. జనం కోరుకుంటేనే అవుతానని జనసేనాని వెల్లడించారు.విడగొట్టే వాళ్ల మాటలు నమ్మకండి దేశ సమగ్రతకు భంగంకలిగించి.. మతాల మధ్య చిచ్చుపెడితే ఊరుకోమంటూ వార్నింగ్ ఇచ్చారు. తన వారాహి వాహనంపై జరుగుతున్న రచ్చతో పాటు వైసీపీ ప్రభుత్వ పాలనపై పవన్ విమర్శలతో విరుచుకుపడ్డారు. రోడ్డు మీదకు వస్తానంటే మిమ్మల్ని ఆపేస్తాం, తోసేస్తాం, కింద పడేస్తాం.. జీవో నంబర్ 1 వ్యవహారాన్ని కూడా ప్రస్తావిస్తూ పవన్ సెటైర్లు సంధించారు. అలాగే మీ వారాహి మా ఏపీ రోడ్లపై ఎలా తిరుగుతుందో మేమూ చూస్తామని కూడా అంటున్నారని పవన్ ప్రస్తావించారు. తానెలా ఆలోచిస్తానంటే వింటానని, మాట్లాడనని, ఈ రంగు కాదు, ఆ రంగు కాదని ఒక్కొక్కరూ పేట్రేగిపోయారంటూ వైసీపీ మంత్రులు, నేతల్ని ఉద్దేశించి విమర్శించారు. అయితే, తాను మర్డర్లు, కోడి కత్తులతో పొడిపించుకోవడం వంటి పనులు చేయనని జనసేనాని ఎద్దేవ చేశారు. తాను చట్టాల్ని పాటించేవాడిని, వాటిని అతిక్రమించి వారాహిని ఎందుకు బయటికి తెస్తామని విమర్శలకు ధీటుగా సమాధానం చెప్పారు. తప్పుడు పనులు చేసి వేల కోట్లు దొబ్బేసి, వేల ఎకరాలు దోచేసుకుని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల్ని కూడా దుర్వినియోగం చేసిన మీకే ఇంత ధైర్యం ఉంటే.. ఏ తప్పూ చేయని మాకెంత ఉండాలంటూ ప్రశల వర్షం కురిపించారు. మీరు మాతో గొడవ పెట్టుకోండి.. అప్పుడు మేం ఏంటో చెప్తామంటూ సవాల్ విసిరారు.వారాహికి కాస్త మదమెక్కనీయండి.. అప్పుడు దండయాత్ర చేద్దామంటూ జనసేనాని కార్యకర్తలను సముదాయించే ప్రయత్నం చేశారు. బాబాయిని చంపి సీబీఐకి కేసు అప్పగించుకోవడం.. కోడి కత్తితో పొడిపించుకుని తెలంగాణ వైద్యులు దగ్గరకు వెళ్లడం.. ఏపీ పోలీసులుపై నమ్మకం, గౌరవం లేదన్న వ్యక్తి.. ఇప్పుడు సీఎంగా పోలీసులు అందరూ శాల్యూట్ చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఒక పోలీసునే జైలులో పెట్టి కొట్టిన వ్యక్తి అతను.. వైసీపీ ప్రజాప్రతినిధులు ఎవరికీ సమాధానం చెప్పనక్కరలేదని అనుకుంటున్నారని విమర్శించారు. వాళ్ల మెడలు వంచి సమాధానం చెప్పిస్తాం.. పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప అంటూ మాటల తూటాలకు పదను పెట్టారు. జనసేన పక్షాన నిలబడిన వ్యక్తి ని రోడ్డు ప్రమాదంలో చంపేశారని.. రేపు ఎలాంటి ప్రభుత్వం వచ్చినా దివ్యాంగులకు పెన్షన్, అభివృద్ధికి తోడ్పాటు అందించే పథకాలు ఉంటాయని హామీ ఇచ్చారు.ఐదు వేల జీతం ఇచ్చే ఉద్యోగాలు ఇచ్చి గొప్పలు చెబుతారా అంటూ ప్రశ్నించారు. వాళ్ల నాన్న సీఎం.. అందుకే కోట్లు దోచుకున్నాడు.. తండ్రి శవాన్ని అడ్డం పెట్టుకుని సీఎం కోసం సంతకాలు చేయించాడు అంటూ సీఎం జగన్‌పై సూటిగా మాటల దాడి చేశారు జనసేనాని. ఇటువంటి వ్యక్తి ని నమ్మి ఓటు వేస్తే వారినీ మోసం చేశాడు.. నాతో సహా ఎవరికీ వ్యక్తిగత ఆరాధన గుడ్డిగా చేయకండని హితవు పలికారు.తెలంగాణ తరహా తిరుగుబాటు ఉద్యమం ఉంటే.. ఏపీ ప్రజలు ఎప్పుడో బాగు పడేవారన్నారు. అభివృద్ధి మీద లేదంటూ విమర్శించారు. జనసేన మాత్రం ప్రజల పక్షానే నిలుస్తుందన్నారు. కులాలను విడదీయటానికి మీ నాయకుడిలా నేను చేయనంటూ వైసీపీ నేతలకు సూచించారు. ప్రధానిని కలిస్తే ఈసారి సజ్జల,వైసీపీ నాయకుల మీద ఫిర్యాదు చేస్తానన్నారు. మీకు వెంకటేశ్వర స్వామి బొమ్మలు ఇస్తారు.. ఏపీలో ఆలయాలు కూలదోస్తారని చెబుతాని అన్నారు. భవిష్యత్తు బాగుంటుంది.. మీరు జనసేనకు అవకాశం ఇవ్వండి.. నేను మాట ఇస్తున్నానంటూ ఆంధప్రదేశ్ ప్రజలను కోరారు. అవకాశవాద రాజకీయం చేసే ముసలి నాయకులను నమ్మవద్దు. దేశ సమగ్రతకు భంగం కలిస్తే.. నేను బలంగా స్పందిస్తా.. నా కుటుంబం కన్నా నాకు ప్రజల క్షేమమే ముఖ్యం. సర్వేజన సుఖినోభవంతు? అందరం కలిసి రాష్ట్రం కోసం పని చేద్దామంటూ జనసేనాని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# సోమేష్ కు కీలక పదవి

విజయవాడ, జనవరి 26, సోమేష్ కుమార్ నిన్న మొన్నటి వరకూ తెలంగాణ ప్రభుత్వ సీఎస్. విభజన సమయంలో ఆయనను ఆంధ్రాకు కేటాయించినా సోమేష్ కుమార్ మాత్రం ససేమిరా ఏపీకి వెళ్లేది లేదంటూ క్యాట్ ను ఆశ్రయించి తెలంగాణలోనే కొనసాగుతూ వచ్చారు. అయితే చివరాఖరకు కోర్టు తీర్పుతో ఆయన అనివార్యంగా



ఏపీకి వెళ్లాల్సి వచ్చింది. అప్పుడు కూడా ఆయన ఏపీలో రిపోర్ట్ చేసి ఆ తరువాత పదవీ విరమణ చేస్తారనీ, బీఆర్ఎస్ లో చేరుతారనీ, లేదా తెలంగాణ ప్రభుత్వమే ఆయనను ఏదో ఒక సలహాదారు పదవిలో అకామిడేట్ చేస్తుందంటూ వార్తలు వచ్చాయి.అయితే అందరి అంచనాలు, ఊహలకు భిన్నంగా సోమేష్ కుమార్ ఏపీలో సెటిల్ అవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఒక విధంగా ఇది ఆశ్చర్యకర పరిణామమే. ఏపీలో పని చేయనని భీష్మించుకు కూర్చున్న సోమేష్ కుమార్ కోర్టు తీర్పుతో అనివార్యంగా ఏపీ వెళ్లినా అక్కడి జగన్ ప్రభుత్వం ఆయనను కీలక పోస్టులోనే నియమించడానికి సుముఖత వ్యక్తం చేయడం కూడా ఆశ్చర్యమే. ఏది ఏమైనా సోమేష్ కుమార్ ఏపీలోన సెటిల్ కావడానికే నిర్ణయించుకున్నారు.ఏపీ సర్కార్ కూడా ఆయనకు పోస్టింగ్ ఇచ్చేందుకు నిర్ణయించుకుంది. అయితే ఈ మొత్తం వ్యవహారం వెనుక బీఆర్ఎస్ ఏపీలో కాలూనడం ప్రధాన కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పైకి ఎలా ఉన్నా ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల మధ్య ఉన్న స్నేహ సంబంధాలు అందరికీ తెలిసిందే. కేసీఆర్ బీఆర్ ప్రకటించగానే.. వైసీపీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు ఆ పార్టీకి ఏపీలో రెడ్ కార్పెట్ అంటూ ఆహ్వానం పలికారు.ఆ తరువాతే.. జాయినై కోర్టు తీర్పును సుప్రీంలో సవాల్ చేసే అవకాశం ఉన్నా సోమేష్ ఆ ఆప్షన్ ఎంచుకోకుండా ఏపీలో తన కంటే జూనియర్ అయిన అధికారికి రిపోర్టు చేయడమే కాకుండా పోస్టు చిన్నాదా పెద్దదా అనే ఆలోచన లేకుండా ఏ పొజిషన్ ఇచ్చినా అభ్యంతరం లేదని చెప్పడంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ ఏడాది డిసెంబర్ లో సోమేష్ కుమార్ పదవీ విరమణ చేయనున్నారు. ఇప్పటి వరకూ సోమేష్ కుమార్ కు ఫలానా పోస్టు అంటూ ఏపీ సర్కార్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయకపోయినా.. నేడో రేపో ఏదో ఒక కీలక పోస్టింగ్ ఇవ్వనున్నట్లు ఏపీ అధికార వర్గాలు చెబుతున్నాయి.

# దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు..

## అమర జవానులకు నివాళి



ఢిల్లీ: దేశం 74వ గణతంత్ర దినోత్సవవేడుకలు నిర్వహిస్తోన్న వేళ.. ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు.'దేశ ప్రజలకు గణంతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. ఈ సారి ఈ వేడుకలు మరింత ప్రత్యేకం. ఎందుకంటే ఆజాదీ కా అమృత్ మహోత్సవం వేళ.. వీటిని నిర్వహిస్తున్నాం. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నెరవేర్చే విధంగా కలిసికట్టుగా ముందుకు సాగుదాం' అని ప్రధాని ట్వీట్ చేశారు. అలాగే దిల్లీలోని యుద్ధ స్మారకం వద్ద ప్రధాని అమర జవాన్లకు నివాళి అర్పించారు.గూగుల్ స్పెషల్ డూడుల్..ప్రముఖ టెక్ సంస్థ గూగుల్( ఈ రోజున ప్రత్యేక డూడుల్‌ను సిద్ధం చేసింది. గూగుల్ స్పెల్లింగ్‌లోని ఐ,నీ,ఐ,శ్రీ,వని లోయర్ కేస్‌లో రాసి, ఇంకో నీ స్థానంలో రాష్ట్రపతి భవనం డోమ్ ప్రతిబింబించేలా తీర్చిదిద్దింది. దీనిని గుజరాత్‌కు చెందిన గెస్ట్ ఆర్టిస్ట్ పార్థ్ కొథేకర్ తీర్చిదిద్దారు. ఈ ఆర్ట్ వర్క్‌లో రాష్ట్రపతి భవన్, ఇండియా గేట్ వంటి ప్రముఖ నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి.

# శివరామకృష్ణ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

## ఏపి రాజధానిపై సుప్రీంలో మరో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ,జనవరి26(: ఏపీ రాజధాని అంశంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. శివరామకృష్ణ కమిటీ సిఫార్సులు అమలు చేయాలంటూ ప్రకాశం జిల్లాకు చెందిన మస్తాన్ వలీ పిటిషన్ దాఖలు చేశారు. ఒకే చోట అభివృద్ధి కాకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధి జరగాలని శివ రామకృష్ణ కమిటీ సూచించిన విషయం తెలిసిందే. ఇప్పటికే మూడు రాజధానుల అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. అమరావతి రాజధాని అంశంపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం, రైతులు ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అమరావతి రాజధాని విచారణ జనవరి 31న జరగనుంది. ఈ క్రమంలో సుప్రీం కోర్టు రెండు పిటిషన్లను కలిపి విచారించే అవకాశం ఉంది.

# సంపాదకీయం

శుక్రవారం 27-01-2023

## కాళ్ల బేరానికి వచ్చిన దాయాది దేశం

భారత్‌తో మూడు ప్రత్యక్ష యుద్ధాలు, అనే పరోక్ష యుద్ధాలు చేసిన పాకిస్థాన్ ఇప్పుడు కాళ్ల బేరానికి వస్తోంది. బుద్ధి వచ్చిందని, అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్నామని ఇటీవల పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహజా షరీఫ్ ఓ ప్రకటన చేశారు. భారత్ తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఆయన ప్రకటనలో నిస్సహాయత ఉంది. అదినిజం. అలాగే కపటత్వమూ ఉంది. అదీ వాస్తవమే. కాశ్మీర్‌తో సహా వివిధ కీలక సమస్యల మీద 'నిజాయతీ'గా చర్చలు జరిపి, వీటికి శాశ్వత పరిష్కారం కనుగొనాలని షరీఫ్ అంటున్నారు. అదే పాకిస్థాన్ లోని కపటత్వాన్ని ప్రపంచానికి మరో సారి ఎత్తి చూపింది. కాశ్మీర్ మీద చర్చించడానికి ఏమీ లేదు. కాశ్మీర్ భారత్‌లోని భాగమని, ఆర్టికల్ 370 రద్దుతో ఇది మరింత ధృవపడింది. కాశ్మీర్ మొదటి నుంచి భారతదేశంలో అంతర్భాగమనీ ఆర్టికల్ 370 రద్దు కూడా భారతదేశ అంతరంగిక వ్యవహారమని పాక్ ప్రపకటన శాంతి చర్చల ప్రతిపాదన ప్రకటనలో అంగీకరించి ఉంటే.. ఆ దేశంలో మార్పు వచ్చిందనీ, వస్తోందనీ ఒకింత విశ్వాసం కలిగేది. కానీ ఆయనా పని చేయలేదు. పాకిస్థాన్ విషయంలో చర్చల ద్వారా పరిష్కరించుకోవలసిన అంశాలు ఉన్నాయన్నపాత పాటనే ఆయన పాడారు. అన్నిటికీ మించి భారత్ లో అశాంతి నింపడం, శాంతి భద్రతల సమస్య సృష్టించడం, మారణహోమం సృష్టించి అస్థిరత నెలకొల్పడం లక్ష్యంగా పాక్ భూభాగంలో శిక్షణ పొంది దొంగచాటుగా సరిహద్దులు దాటి వస్తున్న ఉగ్ర చొరబాట్ల గురించి ఆయన శాంతి చర్చల ప్రతిపాదన ప్రకటనలో ప్రస్తావించలేదు. ఎందుకంటే వాస్తవంగా ఈ విషయాలేవీ ఆయన చేతుల్లో లేవు. ఆయన నియంత్రించలేరు. కాశ్మీర్ సమస్యను రావణ కాష్టం లాగా మార్చడంపైనా అక్కడి సైనికాధికారుల జీవితాలు ఆధారపడి ఉన్నాయి. కాశ్మీర్ కారణంగానే దేశంలో వారి పెత్తనం కొనసాగుతోంది. అందుకే భారత్ పాక్ ప్రతిపాదనకు స్పందించలేదు. భారత్ తో చర్చలకు ప్రయత్నాలు చేయడం కంటే తమ అంతర్గత సమస్యలను పరిష్కరించు కోవడం మీద దృష్టి కేంద్రీకరించడం మేలని అన్యాపదేశంగానైనా పాక్ ప్రధానికి భారత్ విస్పష్టంగా చెప్పింది. భారత్ ఇప్పటికే పాకిస్థాన్‌తో చర్చలకు ససేమిరా అని తేల్చి చెప్పేసింది. అయితే పాక్ బేలగా భారత్ను బతిమలాడుకోవడానికి కారణం ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. గోధుమ పిండి కూడా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇదివరకటి మాదిరిగా యూరోపియన్ దేశాల నుంచి ఆ దేశానికి ఎగుమతులూ జరగడం లేదు. ఏవిధమైన సహాయమూ అందడం లేదు. అమెరికా నుంచి కూడా చాలా చాలా పరిమిత స్థాయిలోనే విదేశీ మారక నిల్వలు దాదాపు అడుగంటి పోయాయి. దీంతో ఇక రానున్నరోజులలో దిగుమతులు కూడా నిలిచిపోయే పరిస్థితి ఉంది. దేశంలో వ్యవసాయ రంగం కుదేలైపోయింది. నిత్యావసర వస్తువుల ధరలు దాదాపు 60 శాతం, అంతకు మించి పెరిగిపోయాయి. చైనా, యు.ఏ.ఇ, సౌదీ అరేబియా వంటి మిత్ర దేశాలు పాకిస్థాను సహాయం చేయడానికి ముందుకు వచ్చినా తక్షణసమస్యల నుంచి గట్టెక్కే అవకాశం లేదు. ఆఫ్ఘనిస్థాన్ చెందిన తాలిబన్లతో పాకిస్థాన్ సంబంధాలు పూర్తిగా దెబ్బతిని పోయాయి. ఈ పరిస్థితుల్లో పాక్ కు భారత్ సహకారమే దిక్కు. అందుకే పాకిస్థాన్ ఇంత బేలగా భారత్ తో శాంతి చర్చల కోసం పాకులాడుతోంది. బతిమలాడుకుంటోంది.

## కాపు నేతల రహస్య భేటీలు...

విజయవాడ, జనవరి 26,తెలుగు రాష్ట్రాల్లో రాజకీయం అంతా సామాజిక సమీకరణాలు చుట్టూ తిరుగుతోంది. ముఖ్యంగా గెలుపోటముల్లో కీలక పాత్ర పోషిస్తారని భావిస్తున్న కాపు సామాజికవర్గం చుట్టూనే రెండు రాష్ట్రాల రాజకీయం నడుస్తోంది. ఇటీవల కాపు సామాజికవర్గ నేతలు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓ సారి విశాఖలో .. మరో సారి హైదరాబాద్‌లో ఇలాంటి సమవేశాలు నిర్వహించారు. అయితే కొన్నాళ్లుగా అలాంటి సమావేశాలు జరిగినట్లుగా బయటకు రాలేదు. కానీ గత ఆదివారం మరోసారి కాపు నేతలు సమావేశమయ్యారని తెలుస్తోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ నేతలు కూడా హాజరయ్యారని అంటున్నారు. దీంతో వచ్చే ఎన్నికల నాటికి కాపు నేతలు రాజకీయ సంచలనం సృష్టించవచ్చన్న అభిప్రాయం ఏర్పడుతోంది. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హోటల్ లో కొంతమంది కాపు నేతల సమావేశం అయ్యారు. ఏపీ , తెలంగాణ కు సంబంధించిన నేతలు హాజరయ్యారని.. రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లుగా చెబుతున్నారు. రెండు రాష్ట్రాల్లో కాపు సామాజిక వర్గ పరిస్థితి వచ్చే ఎన్నికలపై చర్చించారని అంటున్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన తోట చంద్రశేఖర్ కూడా ఈ సమావేశానికి హాజరైనట్లుగా చెబుతున్నారు. ఈ సమావేశాన్ని తోసి పుచ్చలేమని... ఇటీవలి కాలంలో కాపు సామాజికవర్గ నేతలు.. ఐక్యత సాధించేందుకు ప్రయత్నిస్తున్నరని కొంత మంది గుర్తు చేస్తున్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ గా మార్చిన తర్వాత కేసీఆర్. ఏపీలో ఓటు బ్యాంక్ సంపాదించడానికి కాపు సామాజికవర్గాన్ని ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నట్లుగా చెబుతున్నారు. అందుకే ఆయన తోట చంద్రశేఖర్ ను.. ఏపీ బీఆర్ఎస్ చీఫ్ గా నియమించారని అంటున్నారు. అంతే కాదు.. బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్న నేతలంతా కాపు సామాజికవర్గానికి చెందినవారే అదే సమయంలో తెలంగాణ చీఫ్ సెక్రటరీగా శాంతి కుమారిని కూడా సామాజిక కోణంలోనే నియమించారన్న ప్రచారం జరుగుతోంది. అదే నిజం అయితే.. హైదరాబాద్‌లో జరిగినకాపు నేతల మీటింగ్‌లో బీఆర్ఎస్ అంశం చర్చకు వచ్చే ఉంటుందని భావిస్తున్నారు. ఏ రాజకీయ నిర్ణయాలు అయినా ఈ సమావేశంలో తీసుకున్నారో లేదో స్పష్టత లేదు . అయితే కాపు నేతలంతా ఎప్పటికప్పుడు సమావేశమైనా అందరూ ఒకే పార్టీ వైపు రావడం లేదా.. కలిసి సొంత పార్టీ పెట్టడం సాధ్యం కాదన్న వాదన ఉంది. రాజకీయాల్లో ఒక్క సామాజికవర్గం అండతో గెలవడం సాధ్యం కాదు. అన్ని వర్గాల మద్దతు లభించాలి. ఈ విషయం రాజకీయాల్లో ధక్కా మొక్కీలు తిన్న ఆ నేతలకు తెలియనిది కాదు. అందుకే .. వారందరూ ఎవరి పార్టీల్లోనే వారు ఉండి... ఉన్నత స్థానానికి ఎదగడానికి ప్రయత్నించాలని అనుకుంటారు కానీ.. సొంత పార్టీ ఆలోచనలు చేయరని అంటున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు మున్నూరు కాపు సామాజికవర్గం మద్దతు కీలకం. వీరి మద్దతు కోసం .. చేసే ప్రయత్నాల్లో ఈ నేతలు సహకారం అందించవచ్చని చెబుతున్నారు. కారణం ఏదైనా.. కాపు నేతల సీక్రెట్ మీటింగ్స్ మాత్రం ... తరచూ చర్చనీయాంశమవుతున్నాయి.

## రాయపాటి... రచ్చ మాములుగా లేదే



గుంటూరు, జనవరి 26,కొందరు నాయకులుంటారు. వారి నోటికి అందరూ భయపడాల్సిందే. అలాంటి లీడర్లకు సంతోషం వచ్చినా పట్టలేం. ఆగ్రహం కలిగినా ఆపలేం. అలాంటి వారిలో రాయపాటి సాంబశివరావు ఒకరు. తమకు నచ్చకుంటే నిర్మొహమాటంగానే చెప్పేస్తారు. పార్టీ అగ్రనేతలు బాధపడతారనీ ఆలోచించరు. తాము అనుకున్నది అనుకున్నట్లుగా బయటకు కక్కేస్తారు. అలాగే తాము అనుకున్నది జరగకపోతే వెంటనే నెగిటివ్ కామెంట్స్ చేయడానికి కూడా వెనకాడరు. పార్టీ నాయకత్వాన్నే ప్రశ్నించడంలో రాయపాటి ముందుంటారు. అలాంటి రాయపాటి సాంబశివరావు ఇప్పుడు చంద్రబాబుకు కొత్త సమస్య తెచ్చి పెడుతున్నారు. ఇది చివరకు టీడీపీ అధినేతకు తలనొప్పిగా మారనుంది. నరసరావుపేట పార్లమెంటు స్థానం వేరే వాళ్లకు ఇస్తే ఒప్పుకోమని చెప్పారు. తను చెప్పిన వాళ్లకు ఇవ్వకుంటే తమ వర్గం సహకరించదని ఆయన తెగేసి చెప్పారు. బీసీ కార్డులంటూ కడప జిల్లాల నేతలను ఇక్కడ దిగుమతి చేస్తే ఒప్పుకునేది లేదని ఆయన ఒకరకంగా హెచ్చరికలు పంపారు. అవసరమైతే తానే పోటీ చేస్తాను తప్పించి ఇతరులకు తమ స్థానాన్ని ఇచ్చేది లేదని ఖరాఖండీగా చెప్పారు. ఒకటి తన కుమారుడికి. మరొకటి తన కుమార్తెకు రెండు సీట్లు ఇవ్వాలని రాయపాటి గతంలోనే చంద్రబాబును కోరారు. సత్తెనపల్లి అడిగితే ఇంతవరకూ చంద్రబాబు అక్కడ ఇన్‌ఛార్జిని కూడా నియమించలేదు. ఒక కుటుంబానికి ఒకే సీటు అన్న డిసెషన్ చంద్రబాబు తీసుకున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. కేఈ, పరిటాల, జేసీ వర్గాలకే ఈ విషయం స్పష్టం చేశారని రాయపాటి విషయంలో పెద్దగా పట్టించుకోకపోవచ్చు. టీడీపీలో నమ్మకంగా కేఈ కుటుంబంలో ఒక్కరికి మాత్రమే సీటు ఈసారి ఇవ్వనున్నారు. అదీ పత్తికొండ సీటు ఒక్కటే కేఈ శ్యాంబాబుకు ఇవ్వనున్నారు. మిగిలిన వారికి నోఛాన్స్ అని చెప్పేశారు. తాడికొండ సీటును తోకల జనార్థన్ రావుకు ఇవ్వాలని కూడా రాయపాటి మెలిక పెట్టారు. అంటే మొత్తం మూడు సీట్లను రాయపాటి కోరుతున్నట్లు. అయితే వీటిలో ఒక్క సీటు మాత్రం రాయపాటి కుటుంబానికి గ్యారంటీ అంటున్నారు. అదీ రాయపాటి శ్రీనివాస్ కు మాత్రమే ఇస్తారన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. ఆ సీటు కూడా సత్తెనపల్లి కాకపోవచ్చంటున్నారు. పొత్తులన్నీ కుదిరిన తర్వాత గుంటూరు జిల్లాలోనే ఒక సీటు మాత్రం రాయపాటి కుటుంబానికి చంద్రబాబు ఖరారు చేస్తారు. అయితే ఇందుకు ఆయన ఒప్పుకుంటారా? ఎన్నికల సమయంలో రచ్చ చేయరూ? అన్న ఆందోళన గుంటూరు జిల్లా టీడీపీ నేతల్లో వ్యక్తమవుతుంది. మరి రాయపాటి ఏం చేస్తారన్నది ఆసక్తికరమైన అంశమే.

## కోనసీమలో కశ్మీర్ యాపిల్



శ్రీనగర్, జనవరి 26, ఏపీలోని కోనసీమలో ఒక ఇంటి యజమాని తన పెరట్లో యాపిల్ కాయించి భళా అనిపించుకున్నారు. యాపిల్ కాయడానికి ఎంత మాత్రం అనుకూలించని వాతావరణం లో యాపిల్ కాయడంపై యజమాని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట శివారు పెద్దగూళ్ల పాలెంలో యాపిల్ కాసింది. యాపిల్ అతి శీతల ప్రదేశాల్లో పండే పంట.. జమ్ము, కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ వంటి శీతల ప్రదేశాల్లో పండుతుందని చెబుతుంటారు. దీనికి భిన్నంగా కోనసీమలో యాపిల్ పండు మొదటిసారిగా పండింది. ఉష్ణోగ్రత అధికంగా ఉండే ప్రదేశాల్లో పండని ఈ ఆపిల్ ను కోనసీమలో ఓ వ్యక్తి తన పెరట్లో పండించాడు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, పెదగూళ్ళపాలానికి చెందిన దంగేటి వెంకటేశ్వరరావు ఈ ఘనత సాధించాడు. సైకిల్ పై మొక్కలు అమ్మే వ్యక్తి వద్ద నుంచి యాపిల్ మొక్కను కొనుగోలు చేశాడు.ఆ మొక్కను తన పెరట్లో పాతి ఎనిమిది సంవత్సరాల పాటు పెంచాడు. ఆయన పెట్టుకున్న నమ్మకంతో నేడు ఆ చెట్టు శ్రమకు తగ్గ ఫలితాన్ని ఇచ్చింది. ఆ చెట్టుకొమ్మకు ఒక యాపిల్ కాసింది. ఈ విషయం తెలిసిన పలువురు ఆపిల్ చెట్టును చూసి వెళ్తున్నారు. ఎక్కడో శీతల ప్రదేశాల్లో పండే యాపిల్ ఇక్కడ ఉండడం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉద్యాన శాఖ అధికారి భబితను సంప్రదించగా శీతల ప్రదేశాల్లోనే కాకుండా యాపిల్ దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పండే అవకాశం ఉందని తెలిపారు. అయితే కాశ్మీర్ వంటి ప్రదేశాల్లో ఉండే యాపిల్ సైజు మిగతా చోట్ల చిన్నదిగా ఉంటుందని వివరించారు.యాపిల్ లో మంచి ఫైబర్, పెక్టిన్ ఉంటుంది. గట్ ఆరోగ్యానికి సహాయపడుతుంది. ఊబకాయం, బొడ్డు చుట్టూ వచ్చే కొవ్వుని తగ్గిస్తుంది. జీర్ణక్రియ నెమ్మదించేలా చేస్తుంది. ఎక్కువ సేపు పొట్ట నిండిన అనుభూతిని కలిగిస్తుంది. దాని వల్ల ఆహారం తినడం తగ్గిస్తారు. ఫలితంగా బరువు తగ్గుతారు. మరొక అధ్యయనంలో 74 మంది పెద్దలు రాత్రిపూట నారింజ రసం తీసుకున్నారు. ఇందులో కూడా 5-20 గ్రాముల పెక్టిన్ పొందారు. అతి తక్కువ మోతాదులో దీన్ని తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు కనిపించినట్టు పరిశోధకులు తెలిపారు.100 గ్రాముల యాపిల్ లో 19 గ్రాముల చక్కెర, 3 గ్రాముల ఫైబర్ ఉంటుంది. పాలీఫెనాల్స్ కి మంచి మూలం. బెల్లీ ఫ్యాట్ ని కరిగించడంలో పాలీఫెనాల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని పలు అధ్యయనాలు నిర్ధారించాయి. ఒక మీడియం సైజు యాపిల్ లో 27 గ్రాముల కార్బోహైడ్రేట్స్ ఉన్నాయి. యాపిల్ లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. జీవక్రియని మెరుగుపరుస్తుంది. ఇందులోని విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. మెదడు ఆరోగ్యాన్ని పెంచుతుంది. యాపిల్ నుంచి మరిన్ని ప్రయోజనాలు పొందాలంటే తప్పకుండా తొక్కతో కలిపి తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.పెక్టిన్, డైటరీ ఫైబర్ గుణాలు గ్యాస్ట్రిక్ సమస్యలని తగ్గిస్తాయి. పేగు పనితీరుని మెరుగుపరుస్తాయి. మలబద్ధకం సమస్యని నివారిస్తాయి. పెక్టిన్ గ్యాస్ట్రిక్ ఆమ్లంతో కలిసి ప్రీబయోటిక్ గా మారతాయి. ఇవి గట్ ఆరోగ్యానికి చాలా మంచిది. యాపిల్ లేదా సిట్రస్ పండ్ల నుంచి వచ్చే పెక్టిన్ లు గట్ బ్యాక్టీరియాకు విలువైన కార్బన్ మూలాలు అని గతంలోని కొన్ని అధ్యయనాలు నిరూపించాయి. గట్ హెల్త్ బెల్లీ ఫ్యాట్ ని తగ్గించడంలో సహాయపడుతుంది.

## శ్రీవారికి ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు

తిరుపతి, భారత గణతంత్ర దినోత్సవాన్ని తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి ఈవో ఏవి.ధర్మారెడ్డి ప్రసంగించారు. ఈవో మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత హైందవ ధార్మిక సంస్థ అయిన తిరుమల తిరుపతి దేవస్థానంలో అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీపద్మావతీ వేంకటేశ్వరుల సేవలో తరిస్తున్న ధర్మకర్తల మండలి అధ్యక్షులకు, ధర్మకర్తల మండలికి, అధికార యంత్రాంగానికి, అర్చకులకు, సిబ్బందికి, భద్రతా సిబ్బందికి, విశ్రాంత సిబ్బందికి, శ్రీవారి సేవకులకు, స్కౌట్స్ అండ్ గైడ్స్కు, భక్తులకు మరియు మీడియా మిత్రులకు 74వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన మహనీయులందరినీ మరోసారి స్మరించుకోవడం మనందరి బాధ్యత. ఈ గణతంత్ర పర్వదినం రోజున టిటిడి భక్తులకు చేస్తున్న అనేక సేవలను తెలియజేస్తున్నాను. శ్రీవారి ఆలయం తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు టిటిడి నిర్వహణలోని అన్ని ఆలయాలలో జీయంగార్లు, ఇతర ప్రముఖ ఆగమశాస్త్ర పండితుల సలహాల మేరకు నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహిస్తున్నామని అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 2 నుండి 11వ తేదీ వరకు 10 రోజుల పాటు వైకుంఠ ద్వారం తెరిచి సుమారు 6.06 లక్షల మంది భక్తులకు దర్శనభాగ్యం కల్పించాం. వైకుంఠ ద్వార దర్శనానికి రాష్ట్రవ్యాప్తంగా 197 ఎస్సి, ఎస్టి, బిసి గ్రామాల నుంచి 9700 మందికి దర్శనభాగ్యం కల్పించాం. వీరందరికి ఉచిత రవాణా, వసతి, ఆహారం అందించామని అన్నారు.సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చే భక్తులు క్యూ లైన్లలో కిలోమీటర్ల దూరం చలిలో వేచి ఉండి ఇబ్బంది పడకుండా ఉండటం కోసం తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం కాంప్లెక్స్, గోవిందరాజస్వామి సత్రాల వద్ద నవంబరు 1 నుండి సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్ల జారీ కేంద్రాలు నిర్వహిస్తున్నాం. - దీనివల్ల భక్తులు తిరుపతిలో టోకెన్ తీసుకుని వారికి కేటాయించిన సమయానికి తిరుమలకు చేరుకుని, సత్వరమే దర్శనం చేసుకునేందుకు ఈ విధానం ఉత్తమమైనదిగా భావించామని అన్నారు.డిసెంబరు 1 నుండి బ్రేక్ దర్శన సమయం మార్పు శ్రీవారి దర్శనార్థం కంపార్ట్మెంట్లలో రాత్రి వేళ వేచి ఉండే సామాన్య భక్తులకు నిరీక్షణ సమయం తగ్గించేందుకు, ఉదయం త్వరగా దర్శనం కల్పించేందుకు వీలుగా డిసెంబరు 1వ తేదీ నుండి విఐపి బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం 5.30 నుండి 8 గంటలకు మార్పు చేసి ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నాం. భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానం విజయవంతంగా అమలు జరుగుతుండటంతో మరో రెండు నెలలు పరిశీలించాక తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు :జనవరి 28న తిరుమల శ్రీవారి ఆలయంలో రథసప్తమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేశాం. ఈ సందర్భంగా శ్రీ మలయప్పస్వామివారు ఒకేరోజు సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. వాహనసేవలను వీక్షించేందుకు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో వేచి ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, కాఫీ, టీ, పాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. నాలుగు మాడవీధుల్లో ఎండవేడి తగలకుండా అక్కడక్కడ షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.ఎస్వీ మ్యూజియం టాటా సంస్థ విరాళంగా అందించిన రూ.120 కోట్లతో తిరుమలలోని ఎస్వీ మ్యూజియాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నాం. ఇందులో శ్రీవారి ఆభరణాల 3డి ఇమేజితోపాటు ఇతర కళాఖండాలను ప్రదర్శిస్తాం.

## వారాహి ఎందుకు పవర్ ఫుల్

విజయవాడ, జనవరి 26, జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. రాజకీయాల్లో క్రీయాశీకలంగా వ్యవహరిస్తున్నారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జనసేనాని...అందుకు తగ్గట్టుగానే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుంటున్నారు. ఇకపై నిత్యం ప్రజా క్షేత్రంలో ఉండేలా జనసేనాని ప్లాన్ చేసుకుంటున్నారు..దానికి తగ్గట్టే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించడం కోసం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసుకున్నారు.ఆ వాహనం పేరు 'వారాహి'. అసలు వారాహి అనే పేరుకు అర్థం ఏంటి? ఎందుకు పవన్ కళ్యాణ్ తన వాహనానికి ఈ పేరు పెట్టారు? ఈ పేరు ఎందుకంత పవర్ ఫుల్...పురాణాల గురించి తెలిసిన వారికి శ్రీ మహావిష్ణువు వరాహ అవతారం గురించి తెలిసే ఉంటుంది. విష్ణువు దశవాతారాల్లో వరహ అవతారం ఒకటి. హిరణాక్షుడు అనే రాక్షసుడు వేదాలను దొంగిలించి..భూమిని సముద్రంలో దాచేస్తాడు. అప్పుడు విష్ణుమూర్తి వరాహ అవతారం ఎత్తి హిరణ్యాక్షుడిని సంహరించి వేదాలను కాపాడి భూమిని ఉద్ధరిస్తాడు. ఈ వరాహస్వామి అర్థాంగి 'వారాహి'అమ్మవారి శక్తిరూపాల్లో వారాహి దేవి ఒకరు. ఈమెను సప్త మాతృకలలో ఒకరిగా, దశమహావిద్యల్లో ఒకరిగా పూజిస్తారు. ఈమె వరాహ(పంది) ముఖం కలిగి ఉంటుంది. ఈమెను లక్ష్మీ దేవి స్వరూపంగా కూడా పూజలందిస్తారు. వరాహస్వామి అర్థాంగి అయిన వారాహిని నేపాల్ బారాహి అని పిలుస్తారు. ముఖ్యంగా ఈ అమ్మవారిని తాంత్రిక పద్ధతుల్లో పూజిస్తారు. దేవీ మాహాత్మ్యంలో ఉన్న శుంభ-నిశుంభ వధ కథ ప్రకారం దేవుళ్ళ శరీరాల నుంచి వారి స్త్రీ రూప శక్తులు ఉద్భవిస్తాయి. శివుడి నుంచి శివాని, విష్ణువు నుంచి వైష్ణవి, బ్రహ్మ నుంచి బ్రహ్మణి..ఇలా వరాహ స్వామి నుంచి వారాహి ఉద్భవించింది. రక్తబీజుడిని చంపడం కోసం దుర్గా దేవి సప్త మాతృకలతో కలిసి పోరాడుతుంది. ఎరుపు వర్ణం చర్మంతో గేదె వాహనంగా చేతులలో ఖడ్గం, డాలు, అంకుశం ధరించి ఉంటుంది వారాహి.దేవీ మాహాత్మ్యంలోని తర్వాత జరిగిన కథ ప్రకారం రక్తబీజుడనే రాక్షసుడి సంహారం కోసం దుర్గాదేవి తన దేహం నుంచి మాతృకలను సృష్టిస్తుంది. అలా పుట్టుకొచ్చిన మాతృకలతో రాక్షసుడిని, అతడి సేనను సంహరిస్తుంది.వామన పురాణాం ప్రకారం మాతృకలు అమ్మవారి రూపమైన చండిక నుండి ఉద్భవిస్తారు. వీపు భాగం నుంచి వారాహి ఉద్భవించింది.మార్కండేయ పురాణం ప్రకారం వారాహి వరాలనిచ్చే తల్లి, వివిధ దిక్కులను మాతృకలు కాస్తారు అని చెప్పే స్తోత్రంలో ఈమె కాచేది ఉత్తర దిక్కును. మత్స్యపురాణం ప్రకారం ఈమె జననం భిన్నంగా ఉంది. ఈ పురాణం ప్రకారం ఈమె



అంధకాసురుడనే రాక్షసుడ్ని సంహరించేందుకు సహాయం కోసం శివుడు సృష్టించిన శక్తిగా చెబుతారు.లలితాదేవికి సైన్యాధిపతిగా వారాహిదేవిని వర్ణిస్తారు. అందుకే వారాహి అమ్మవారి ప్రస్తావన లలితా సహస్ర నామంలో కూడా ఉంటుంది.వారాహిని ఆరాధిస్తే జీవితంలో ఎదురయ్యే అడ్డంకులన్నీ తొలగిపోతాయనీ, శత్రుభయం ఉండదనీ, అపార జ్ఞానం సిద్ధిస్తుందనీ, కుండలినీ శక్తి జాగృతమవుతుందనీ చెబుతారు.వామాచారం పాటించే భక్తులు రాత్రిపూటల తాంత్రిక పద్ధతులలో వారాహిని పూజిస్తారు. ప్రతి మనిషిలోనూ వారాహీశక్తి నాభి ప్రాంతంలో ఉంటూ మణిపూర, స్వాధిష్ఠాన , మూలాధార చక్రాలను ప్రభావితం చేస్తుంది . వారాహి వారణాసికి గ్రామదేవత. కాశీలో ఉన్న వారాహి ఆలయానికి ఎప్పుడంటే అప్పుడు వెళ్లే వీలుండదు. భూ గర్భ గృహంలో ఉండే ఈ ఆలయం నిత్యం తెల్లవారుజాము 4.30 నుంచి 8 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంటుంది. ఆ సమయంలో గ్రామ దేవత అయిన వారాహి అమ్మవారు వారణాసిని చూసి రావడానికి వెలుతుందంట. ఆలయం తెరిచిన సమయంలో దర్శనానికి వెళితే నేల పై రెండు రంధ్రాలు కనిపిస్తాయి. వాటి ద్వారా మాత్రమే అమ్మవారిని దర్శించుకోవాలి.. ఒక రంధ్రంలోనుంచి చూసినప్పుడు అమ్మవారి ముఖం..మరో రంధ్రం నుంచి అమ్మవారి పాద ముద్రలు కనిపిస్తాయి. వారాహి అమ్మవారు ఉగ్రరూపిని కాబట్టే ఇలా రంధ్రాల ద్వారా దర్శించే ఏర్పాటు చేసినట్లుగా చెబుతారు పండితులు. దుష్ట శక్తులను అణిచేసే వారాహి అమ్మవారి ఆలయం వారణాసిలోని దశాశ్వమేధ ఘాట్ కు ఎడమ వైపు ఉంటుంది .దుష్ట సంహారం చేసే అమ్మవారి పేరు పవన్ కళ్యాణ్ తన వాహనానికి పెట్టడంతో ఈ పేరు, ఆ వాహనం గురించి సోషల్ మీడియాలో భారీ చర్చ జరుగుతోంది...

# కడప జిల్లా వైసీపీలో లొల్లి



కడప, జనవరి 26, కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల మధ్య విభేదాలు రాజుకుంటూనే వున్నాయి. అనుచరుడిగా ఉంటారని ఆ ఎమ్మెల్యే కోరి తెచ్చుకున్న వ్యక్తి ఆయనకే కొరగాని కొయ్యగా మారిపోయాడు. మారిన పరిణామాలతో ఆ అనుచరుడికి ఊహించని పదవి వచ్చింది. దీంతో అధికారపార్టీలో వర్గవిభేదాలు పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. అధిష్ఠానానికి తలనొప్పులు వచ్చిపడుతున్నాయి.రాచమల్లు, రమేష్ మధ్య మలుపులు తిరుగుతున్నాయి. కడప జిల్లా ప్రొద్దుటూరులో వైసీపీ ఆవిర్భావంతో లోకల్ పాలిటిక్స్ మారిపోయాయి. అప్పటిదాకా పోటీ టీడీపీ, కాంగ్రెస్ మధ్య ఉండేది. ఆ తర్వాత పోరు వైసీపీ, టీడీపీగా మారిపోయింది. ప్రస్తుతం వైసీపీదే హవా. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి.. ఒకసారి ప్రతిపక్ష ఎమ్మెల్యేగా, ఇప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి. అలాంటి ప్రొద్దుటూర్‌లో మున్సిపల్ ఎన్నికలు ఎమ్మెల్యేకు ఇబ్బందిని తెచ్చిపెట్టాయి. ఆ ఎన్నికల్లో యాదవ సామాజికవర్గానికి చెందిన మాజీ మున్సిపల్ ఛైర్మన్ వెంకట సుబ్బయ్య కుమారుడు రమేష్ యాదవ్‌ను ఛైర్మన్ అభ్యర్థిగా ప్రకటించారు. ఆయన కౌన్సిలర్‌గా గెలిచారు. కానీ.. ఛైర్మన్‌గా రమేష్ యాదవ్ పేరును ప్రకటించలేదుఅయితే అక్కడే ట్విస్ట్. బీసీ సామాజికవర్గంలో చేనేత వర్గానికి చెందిన లక్ష్మీదేవిని ఛైర్‌పర్సన్‌ను చేశారు. ఆ సమయంలో ఎమ్మెల్యే రాచమల్లు, రమేష్ యాదవ్ మధ్య మొదలైన రగడ అనేక మలుపులు తిరుగుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో తాను ఖర్చు పెట్టిన 5 కోట్లు తిరిగి ఇవ్వాలని రమేష్ గొడవ చేశారు. దాంతో రమేష్‌కు రాష్ట్రస్థాయి పదవి ఇప్పిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు బహిరంగంగా ప్రకటించారు. యాదవ సామాజికవర్గంపై తనకు ఎనలేని ప్రేమ ఉందని చెప్పారు. ఎవరూ ఊహించని రీతిలో రమేష్ యాదవ్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీని చేశారు సీఎం జగన్. వైసీపీలో ఇదో సంచలనం. ఎమ్మెల్సీ పదవి తన పలుకుబడితోనే వచ్చిందని ఎమ్మెల్యే రాచమల్లు చెప్పుకున్నా దానిని ఎవరూ పట్టించుకోలేదుఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలోనే ఎమ్మెల్సీ రమేష్‌ను చంపుతామని.. టీడీపీ నేత నందం సుబ్బయ్యకు పట్టిన గతే పడుతుందని ఫోన్‌లో బెదిరించారు. ఈ బెదిరింపుల వెనక ఎమ్మెల్యే రాచమల్లు హస్తం ఉందని ప్రచారం జరిగింది. అయితే వాటిని ఎమ్మెల్యే ఖండించారు. ఫోన్‌లో బెదిరించిన వాళ్లను పట్టుకుని నడిరోడ్డులో ఊరేగించాలని ఎస్పీకి ఫోన్ చేసి చెప్పారు రాచమల్లు. ఫోన్ బెదిరింపులపై కేసు నమోదైనా.. ఏమైందో ఎవరికీ తెలియదు.అధిష్టానం సూచనలతో ప్రొద్దుటూరు రాజకీయాలను రాచమల్లుకే వదిలి జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో తిరుగుతూ వస్తున్నారు ఎమ్మెల్సీ రమేష్. పార్టీ అధిష్ఠానం కూడా ఎమ్మెల్సీకి అండగా ఉందని టాక్ నడిచింది. బద్వేల్ ఉపఎన్నిక, కమలాపురం మున్సిపల్ ఎన్నికలు ఎమ్మెల్సీని పార్టీకి మరింత దగ్గర చేసినట్టు ప్రచారం జరిగింది. ఈ పరిణామాలు.. ప్రచారం ఎమ్మెల్యే రాచమల్లు, ఎమ్మెల్సీ రమేష్ మధ్య ఇంకా గ్యాప్ తీసుకొచ్చాయి. ప్రొద్దుటూరులో ఎమ్మెల్సీకి ప్రొటోకాల్ దక్కకుండా అడ్డుకోవడంపై వివాదం రాజుకుంది. అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాచమల్లు ఫొటోలతో సమానంగా ఎమ్మెల్సీ రమేష్ ఫొటో, పేర్లు కనిపించడంలేదు.ఎమ్మెల్సీ బర్త్‌డే వేడుకల సందర్భంగా వేసిన ఫ్లెక్సీల్లో సీఎం, ఎంపీ ఫొటోలు తప్ప ఎమ్మెల్యే ఫొటోలు లేవు. దీంతో ఎమ్మెల్యే వర్గానికి చెందిన కసిరెడ్డి మహేశ్‌రెడ్డి ఎమ్మెల్సీ వర్గీయులతో గొడవ పడ్డారు. భౌతికదాడులకు దిగారు. తనను చంపుతానని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ గన్ గురిపెట్టారని వైసీపీ కౌన్సిలర్ లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల మధ్య గొడవలు తారస్థాయికి చేరాయి. ఈ వివాదాన్ని ఎలా తేల్చాలో తెలియక పార్టీ పెద్దలు ఇబ్బంది పడుతున్నారు. ఇది చాలదన్నట్టుగా 2024లో వైసీపీ టికెట్ బీసీలకు ఇస్తారన్న ప్రచారం ఎమ్మెల్యే వర్గానికి మింగుడుపడడం లేదు.

# వాళ్లిద్దరూ...గండ బేరండలేనా

విజయవాడ, జనవరి 26, 2019ఎన్నికల్లో దారుణ ఓటమి తర్వాత చంద్రబాబు తరచూ పార్టీ నేతలతో జరిగే సమావేశాల్లో ఒక మాట చెప్పేవారు. పార్టీ కోసం కష్టపడిన వారికే మళ్లీ టిక్కెట్లని, కష్టపడకపోయినా, పార్టీ కార్యక్రమాలను సజావుగా చేపట్టకపోయినా టిక్కెట్ ఇచ్చేది లేదని పదే పదే చంద్రబాబు చెప్పేవారు. ఎందుకంటే కరోనాతో దాదాపు రెండేళ్లు ప్రజలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. కరోనా తగ్గిన తర్వాత కూడా అనేక మంది నేతలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం లేదు. ఖర్చుకు భయపడి కావచ్చు. అధికార వైసీపీ పెట్టే అక్రమ కేసులకు భయపడి కావచ్చు. కారణాలేదైనా మొన్నటి వరకూ కొందరు నేతలు దూరంగానే ఉన్నారు.చంద్రబాబు మాత్రం నియోజకవర్గాల సమీక్షల్లోనూ, జిల్లాల పర్యటనల్లోనూ నేతలను పదే పదే హెచ్చరించేవారు. కేంద్ర పార్టీ ఇచ్చిన నివేదికల ప్రకారం ఆయన అనేక మంది నేతలకు వార్నింగ్ కూడా ఇచ్చారు. దీంతో పాటు నలభై శాతం మందికి యువతకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడల్లా చంద్రబాబు ఇదే విషయాన్ని ప్రస్తావించేవారు. కానీ చంద్రబాబు వీక్‌నెస్ నేతలకు తెలియంది కాదు. గత దశాబ్దాలుగా ఆయనను దగ్గర నుంచి చూస్తున్న నేతలయిపాయె. తమకు తప్ప చంద్రబాబు ఇంకెవ్వరికీ టిక్కెట్ ఇవ్వరన్న ధైర్యం కావచ్చు. అందుకే కొందరు సీనియర్ నేతలు కూడా లైట్ గా తీసుకున్నారు. అంద ప్రధానంగా వచ్చే ఎన్నికలకు పెద్దమొత్తంలో ఖర్చు చేయాల్సి రావడం, గత ఎన్నికల్లో చేసిన ఖర్చు నుంచి కోలుకోకపోవడంతో నేతలు కొందరు పార్టీ కార్యక్రమాలను పెద్దగా చేపట్టలేదనే చెప్పాలి.ఏదో కోస్తా జిల్లాలు మినహాయించి ఎక్కడా టీడీపీ నేతల అలజడి పెద్దగా కనిపించలేదు. గత ఆరు నెలల నుంచే నేతలు బయటకు వస్తున్నారన్నది కూడా వాస్తవం. అదే సమయంలో ఇప్పుడు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అంశం చర్చనీయాంశమైంది. గంటా దాదాపు మూడేళ్ల పాటు పార్టీ కార్యాలయానికి కూడా రాలేదు. అసెంబ్లీకి తొలి రోజుల్లో వచ్చినా మౌనంగా ఉండేవారు. తర్వాత విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణకు నిరసనగా రాజీనామా చేశారు. విశాఖ ఉక్కు సమస్యపై పల్లా శ్రీనివాసరావు ఆమరణదీక్షకు దిగినా అటు వైపు గంటా చూడలేదు. అంతెందుకు చంద్రబాబు, లోకేష్ లు వెళ్లినా ఆయన లైట్ గా తీసుకున్నారంటారు. తాను గెలిచిన నియోజకవర్గంలో కూడా పెద్దగా పర్యటించలేదు. అక్కడ ఒక ఇన్‌ఛార్జిని పెట్టి ఇన్నాళ్లూ లాగించేశారు. కానీ సడెన్ గా గంటా ఎంట్రీ ఇచ్చారు. లోకేష్ తో సమావేశమయ్యారు.లోకేష్ నుంచి ఎలాంటి హామీ లభించిందో ఏమో తెలియదు కాని గంటా మళ్లీ యాక్టివ్ అయ్యారు. అయితే దీనిపై సొంతపార్టీలోని ఆయన ప్రత్యర్థి అయ్యన్న పాత్రుడు ఫైర్ అయ్యారు. పార్టీ కష్టకాలంలో ఉన్న గంటా ఇప్పుడు రావడమేంటి? ఆయనెవడండీ? ఆయనమైనా ప్రధానా? అని అయ్యన్న ప్రశ్నించాడు. కానీ చంద్రబాబు మాత్రం గంటాను గెంటేయలేని పరిస్థితి ఉంది. ఎందుకంటే గెలుపు గుర్రాలను ఆయన ఎంపిక చేయాల్సి ఉంది. మరోవైపు గంటా కాపు సామాజికవర్గానికి చెందిన నేత. ఆయన కోరుకున్న చోట టిక్కెట్ దక్కకపోయినా ఏదో ఒక టిక్కెట్ టీడీపీ అధినేత ఇస్తారన్న నమ్మకం ఆయనకు ఉంది. అందుకే మూడేళ్ల పాటు అన్నింటికీ దూరంగా ఉన్నా ఇప్పుడు పార్టీలో యాక్టివ్ అవుతానని చెప్పినా అధినేత కాదనే పరిస్థితి లేదన్నది కాదనలేని వాస్తవం.ఇక మరోవైపు ఆనం రామనారాయణరెడ్డి వైసీపీలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆయనకు పొగ పెట్టేశారు. ఆనం వేరే పార్టీ చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆనం కూడా తక్కువ స్థాయి రాజకీయ నేత కాదు. అంగ, అర్థబలం ఉన్న నేత కావడంతో ఆయన టీడీపీలోకి వస్తామంటే రెడ్ కార్పెట్ పర్చడం ఖాయమని అందరికీ తెలిసిందే. 2019 ఎన్నికలకు ముందు ఆయన పార్టీ వీడి వెళ్లినా మరోసారి కండువా కప్పేందుకు సిద్ధంగా ఉంటారు. మరి ఈ మూడేళ్లు అక్కడ కష్టపడిన వారి పరిస్థితి అని అడిగితే అధికారంలోకి వస్తే వారికి ఏదో ఒక పదవి ఇస్తామని చెప్పడం మినహా చంద్రబాబు వద్ద నుంచి మరో ఆన్సర్ రాదు. ఇటు తాను తొలుత వార్నింగ్ ఇచ్చినట్లుగా గంటాను గెంటేయలేరు. అటు ఆనం ను పార్టీలోకి రాకుండా ఆపనూ లేరు. ఎందుకంటే గెలుపు ముఖ్యం. ఎన్నికల్లో అదే అవసరం కనుక ఎవరైనా సత్తా ఉన్నవోడికి పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఇది చంద్రబాబు స్కూలు. అర్థం చేసుకున్నోడికి తెలుసు. కాకుండా ఉన్న వాళ్లను ఏమీ చేయలేం.

## మచిలీపట్నం లో ఘనంగా 74 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

మచిలీపట్నం 74 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా కేంద్ర మైన మచిలీపట్నం పోలీస్ పిరియడ్ గ్రౌండ్ లో జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాష జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ డా. అపరాజితా సింగ్, జిల్లా ఎస్పీ పి జాషువా , అడిషనల్ ఎస్పీ వెంకట రామాంజనేయులు , జిల్లా అధికారులు పాల్గొన్నారు. పోలీస్ పెరేడ్ కమాండర్ ఆధ్వర్యంలో. పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో వేడుకలు కళాశాల హార్బర్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. వైయస్సార్ పింఛన్ కానుక, జగనన్న అమ్మ ఒడి, జగనన్న చేదోడు , వైయస్సార్ చేయూత, వైయస్సార్ ఆసరా, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్ఆర్ నేత నేస్తం మొదలగు ప్రభుత్వ పథకాల అందించడం లో సఫలమయ్యము అన్నారు.స్వాతంత్ర్య సమరయోధు ల కుటుంబాలకు జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్ , జిల్లా ఎస్పీ, మరియు జెడ్పీ చైర్పర్సన్ లు సత్కరించారు. అంతరం శకటాల ప్రదర్శన లో భాగం గా వివిధ రంగాలకు చెందిన శకటాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## టీటీడీ పరిపాలనా భవనంలో మువ్వన్నెల జెండా రెపరెపలు

తిరుపతి తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలో భారత గణతంత్ర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఇక్కడి పరేడ్ మైదానంలో టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు.ఈ సందర్భంగా టీటీడీ భద్రతా సిబ్బంది చేసిన కవాతు ఆకట్టుకుంది. ఎవిఎస్వో విశ్వనాథం పెరేడ్ కమాండర్గా వ్యవహరించారు. అనంతరం టిటిడి ఈవో ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ తరువాత విధుల్లో ఉత్తమసేవలు అందించిన వివిధ విభాగాలకు చెందిన 32 మంది అధికారులు, 237 మంది ఉద్యోగులకు, ఎస్విబిసి లో 5 మంది ఉద్యోగులకు ఐదు గ్రాముల శ్రీవారి వెండి డాలర్, ప్రశంసాపత్రం అందజేశారు. ప్రత్యేక ఆకర్షణగా టిటిడి జాగిలాల ప్రదర్శన : టీటీడీ నిఘా మరియు భద్రత విభాగం ఆధ్వర్యంలో జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డాగ్ స్క్వాడ్ ఇన్చార్జి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. విరాట్, శింబా, ఇందు, హంటర్, వర్ష, బ్యూటీ అనే జాగిలాలు పాల్గొన్నాయి.ఇందులో గ్రూప్ డ్రిల్, పేలుడు పదార్థాలను, మాదకద్రవ్యాలను గుర్తించడం, సైలెంట్ డ్రిల్, వస్తువులను జాగ్రత్తగా కాపాడడం, పారిపోతున్న సంఘ విద్రోహులను గుర్తించి నిలువరించడం తదితర ప్రదర్శనలను జాగిలాలు ఇచ్చాయి.ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలుసాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థినులు “సుమనస వందిత.....”, “జన జాగృత నవ భారత నవోదయం...”, “తిరువీధులలో మెరసే దేవదేవుడు.....” తదితర దేశభక్తి గీతాలకు చక్కటి నృత్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డా।। వి.కృష్ణవేణి, వ్యాఖ్యాతగా వ్యవహరించారు.గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, డిఎల్ఓ రెడ్డప్పరెడ్డి, సిఇ నాగేశ్వరరావు, ఎఫ్ఏ అండ్ సిఏఓ బాలాజి, అదనపు సివిఎస్వో శ్రీ శివ కుమార్ రెడ్డి, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ కుమార్, అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గంటల తరబడి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో లోకేష్ ను నిలపెట్టారు

తిరుమల యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టే ముందు తిరుమల శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను గంటల తరబడి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో నీరీక్షించేలా ప్రభుత్వం వ్యవహరించని పులివెందుల టిడిపి ఇంఛార్జ్ బిటెక్ రవి ఆరోపించారు.. గురువారం ఉదయం స్వామి వారి సేవలో నారా లోకేష్ తో పాటుగా బిటెక్ రవి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.. దర్శనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన బిటెక్ రవి మీడియాతో మాట్లాడుతూ.. కుప్పం నుండి ప్రారంభం కాబోయే నారా లోకేష్ పాదయాత్రకు ముందుగా శ్రీనివాసుడి ఆశీస్సుల కోసం నారా లోకేష్ తిరుమలకు రావడం జరిగిందని, ఆయనకు సంఘీభావం తెలుపుతూ తాము అంతా నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని మనస్సు పూర్తిగా ప్రార్ధించడం జరిగిందన్నారు.. శ్రీనివాసుడి ఆశీస్సుల కోసం వచ్చిన నారా లోకేష్ ను గంటల తరబడి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో నీరీక్షించేలా చేసారని మండిపడ్డారు..

ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు కల్పించినా నారా లోకేష్ స్వామి వారి ఆశీస్సులు పొందారని, అంతేకాకుండా పాదయాత్ర చేస్తారని, ఆ పాదయాత్ర కూడా విజయవంతం అవుతుందన్నారు.. దేవదేవుడి ఆశీస్సుల కోసం వచ్చిన ఇలాంటి తరుణంలో కూడా చిన్న చిన్న అడ్డంకులు, ఇబ్బందులకు గురి చేసి ఛీఫ్ ట్రిక్స్ ఉపయోగించి ఇంత నీచస్థితికి దిగజారడం చాలా దారుణమైన విషయమన్నారు.. నారా లోకేష్ నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేయగలడా అని కొందరికి అనుమానం ఉండచ్చుని, కానీ అలాంటి వారికి ఎటువంటి అనుమానం అక్కరలేదని ఈ పాదయాత్ర అద్భుతంగా విజయవంతం అవుతుందని, ఈ రాష్ట్రానికి పట్టిని పీఢ విరడగ అవుతుందన్నారు.. నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభం కాకముందే రోజా ఆస్ట్రాలజిస్టు లగా సర్వమంగళం అవుతుందని మాట్లాడడం సరైనా విధానం కాదన్నారు.. లోకేష్ బాబు క్యారెక్టర్ ను పాడు చేయాలని నిక్ నిమ్స్ పెట్టి అనేక మాటలు మాట్లాడుతూ వచ్చేవారని, పాదయాత్రలో నారా లోకేష్ ఎలా మమేకం అవుతారో చూసారని, సీఎం జగన్మోహన్ పేపర్ పెట్టుకుంటేనే గానీ స్పీచ్ ఇవ్వలేని పరిస్థితికి వచ్చారని, అలాంటిది నారా లోకేష్ కి, జగన్మోహన్ రెడ్డి చాలా వ్యత్యసం ఉందని, వైసీపికి అభద్రత భావం కలిగిందని, ప్రభుత్వం పాదయాత్ర ఆపేందుకు చాలా కుట్ర పొందారని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్ర విజయవంతం చేసి తీరుతాంని పులివెందుల టిడిపి ఇంఛార్జ్ బిటెక్ రవి తెలియజేశారు.

# కుప్పానికి జూనియర్ ఎన్టీఆర్...?

తిరుపతి, జనవరి 26,టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. యువగళం పేరిట చేపట్టనున్న పాదయాత్ర కుప్పం నుంచి శుక్రవారం (జనవరి 27) ప్రారంభం కానుంది. ఈ ప్రారంభ కార్యక్రమంలో అటు నారా ఫ్యామిలీ, ఇటు నందమూరి ఫ్యామిలీలు హాజరవుతున్నాయని తెలుస్తోంది. మరోవైపు టీడీపీ శ్రేణులు సైతం భారీగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కుప్పం తరలిరానున్నాయి. అయితే ఈ పాదయాత్ర ప్రారంభంలో యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్‌తోపాటు ఆయన ఫ్యామిలీ సైతం హాజరు కానుందని తెలుగుదేశం శ్రేణులుఅంటున్నాయి. అలాగే నందమూరి ఫ్యామిలీ నుంచి హీరోలు నందమూరి కల్యాణ్ రామ్, తారకరత్న, అలాగే చంద్రబాబు సోదరుడి కుమారుడు నారా రోహిత్ ఈ పాదయాత్ర ప్రారంభ కార్యక్రమానికి హాజరుకానున్నారని సమాచారం. ఇక జూనియర్ ఎన్టీఆర్.. సినిమాల్లో నటిస్తూ.. బీజి బీజిగా ఉన్నా వైపు టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విషయంలోనే కాదు.. టీడీపీపై జగన్ అండ్ కో వ్యవహారిస్తున్న తీరుపై తనదైన శైలిలో ఎప్పటికప్పుడు స్పందిస్తూనే ఉన్నారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం పేరును జగన్ ప్రభుత్వం మారిస్తే.. ట్విట్టర్ వేదికగా జూనియర్ ఎన్టీఆర్ స్పందించారు. అలాగే ట్రిపుల్ ఆర్ చిత్రంలోని నాటు నాటు పాటకు.. గోల్డెన్ గ్లోబల్ పురస్కారం దక్కించుకున్న సందర్భంలో ఆ చిత్ర దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి, సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణిలతో పాటు చిత్ర యూనిట్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆ శుభాకాంక్షల సందేశంలో చంద్రబాబు జూనియర్ ఎన్టీఆర్ పేరు ప్రస్తావించకున్నా జూనియర్ ఎన్టీఆర్... థ్యాంక్స్ మామయ్య అంటూ రీట్విట్ చేశారు. గత కొంత కాలంగా జూనియర్ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీతో, చంద్రబాబు ఫ్యామిలీలో ఒకింత దూరం పాటిస్తున్నారన్న ప్రచారం ఉంది. ఎన్టీఆర్ ధ్యాంక్యూ మావయ్యా అన్న స్పందన ఆ ప్రచారానికి దాదాపు ఫుల్ స్టాప్ పడినట్లైంది.అలాగే పార్టీలో 1995 ఆగస్టు సంక్షోభం విషయంలో ఇప్పటి వరకూ ఉన్న అపోహలను, అనుమానాలను ఇటీవల బాలకృష్ణ అన్ స్టాపబుల్ షో నివృత్తి చేసేసింది. నాడు మొత్తం తెలుగుదేశం పార్టీ, ఎన్టీఆర్ కుటుంబం కలిసి తీసుకున్న నిర్ణయమని ఎన్టీఆర్ తనయుడు బాలకృష్ణ విస్పష్టంగా ప్రకటించి అన్నిఅనుమానాలకూ తెరదించేశారు. దీంతో మరోవైపు.. నందమూరి, నారా కుటుంబాలు మొత్తం కలిసి ఉన్నాయని .. వీరి మధ్య ఎలాంటి ఆపోహాలు, అగాధాలు లేవని బాలయ్య ఫుల్ క్లారిటీ ఇచ్చేశారు. ఈ నేపథ్యంలోనే జూనియర్ ఎన్టీఆర్ చంద్రబాబు అభినందనలకు ధ్యాంక్యూ మావయ్యా అంటూ వరుస పెట్టి మరీ సంభోదిస్తూ రిప్లై ఇచ్చారని అంటున్నారు. అలాగే అదే నాటునాటుపాట ఆస్కార్ కు నామినేషన్ లభించిన సందర్భాన్ని పురస్కరించుకుని మళ్లీ చంద్రబాబు చిత్ర యూనిట్ కు అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారుజూనియర్ ఎన్టీఆర్ పేరును ట్వీట్ చేయడమే కాకుండా ఆయనకు ట్యాగ్ కూడా చేశారు. ఈ పరిణామాలతో జూనియర్ ఎన్టీఆర్ తో దూరం అన్న ప్రచారానికి ఫుల్ స్టాప్ పడినట్లేనని పరిశీలకులు అంటున్నారు. అదే సమయంలో మరోవైపు నారా లోకేశ్ చేపట్టనున్న పాదయాత్రను తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొంది. ఆ క్రమంలో ఈ పాదయాత్రను సూపర్ సక్సెస్ చేసే విధంగా పావులు కదుపుతోంది. ఇంకోవైపు ఈ పాదయాత్రకు కండిషన్లుతో కూడిన అనుమతి ఇస్తున్నట్లు చిత్తూరు జిల్లా ఎస్పీ ఇప్పటికే ప్రకటించారు.అయితే నారా లోకేశ్ పాదయాత్రకు కండిషన్‌తో కూడిన అనుమతులపై టీడీపీ శ్రేణులే కాదు.. పసుపు పార్టీ అభిమానులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యాత్ర ప్రారంభ కార్యక్రమానికి జూనియర్ హాజరు కానున్నారన్న వార్త తెలుగుదేశం శ్రేణుల్లో ఆనందోత్సాహాలను నింపుతోంది.

## బాలయ్య మాటల్లో వివాదం లేదు

విజయవాడ నందమూరి- అక్కినేని కుటుంబాల మధ్య చిచ్చు రగిల్చిన వివాదం ఇప్పుడప్పుడే తెమిలేలా లేదు. ఇక ఈ విషయంపై అక్కినేని అభిమానులతో పాటు అక్కినేని నట వారసులు కూడా స్పందించారు. దీంతో అక్కినేని అభిమానులు బాలయ్యపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అక్కినేని అభిమానులు తమతో పాటు ఎస్వీ రంగారావు కుటుంబాన్ని కూడా అవమానించడంతో వారిని కూడా తమతో కలవమని అడుగుతుండడంతో వారు కూడా ఈ విషయమై స్పందించారు.నందమూరి బాలకృష్ణ వీరసింహారెడ్డి సక్సెస్ మీట్ లో మాట్లాడిన కొన్ని విషయాల మీద మీడియా, సోషల్ మీడియాలో చాలా ట్రోల్స్ వస్తున్నాయి. స్వర్గీయ ఎస్వీ రంగారావు కుటుంబ సభ్యులుగా, మనవలుగా మేము ఒకే విషయం చెప్పాలని అనుకుంటున్నాం. మాకు, బాలకృష్ణ చాలా మంచి అనుబంధం వుంది. మేము ఒక కుటుంబంగా వుంటాం. ఆయన మాట్లాడినది తోటి నటుడితో జరిగిన సంభాషణ గురించి చాలా జనరల్ గా చెప్పారు. ఈ విషయంలో మాకు, మా కుటుంబ సభ్యులకు ఎలాంటి వివాదం కనిపించడం లేదు. మీడియాలో ఈ విషయాన్ని ఇంకా డ్రాగ్ చేయొద్దు. ఇందులో వివాదాన్ని తీసుకొచ్చి మాకు, మా కుటుంబ సభ్యులకు, నందమూరి వంశానికి, నందమూరి వారసులకు వుండే అనుబంధాన్ని ఇబ్బంది పెట్టొద్దని అందరి అభిమానులను, ప్రజలను కోరుకుంటున్నాం” అంటూ ఎస్వీ రంగారావు మనవళ్లు చెప్పారు

# శ్రీ చైతన్య హ్యాపీ కిడ్స్ పాఠశాలలో ఘనంగా జరిగిన 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ముఖ్యఅతిధులుగా హాజరైన జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాస కళ్యాణ్, ఎంఈఓ శంకరయ్య**



సిద్ధవటం,జనవరి.26, మండలంలోని మాధవరం-1 గ్రామపంచాయతీలోని శ్రీ చైతన్య హ్యాపీ కిడ్స్ పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ కే.అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. అర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గురించి మరియు పార్లమెంటు, లోక్ సభ, కోర్టు జడ్జిమెంటు, టిప్పు సుల్తాన్ పరిపాలన, పోలీస్ స్టేషన్ వంటి కార్యాలయాలను ఏర్పాటుచేసి విద్యార్థులు ప్రత్యేక దుస్తులు అలంకరణతో వేషధారణ వేసి ఆయా శాఖలకు సంబంధించిన కార్యాలయాల గురించి విద్యార్థులకు అవగాహన కలిగేలా గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈఎ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ శంకరయ్య హాజరయ్యారు.

ఈ సందర్భంగా జడ్జి శ్రీనివాస కళ్యాణ్ పాఠశాలలో ఏర్పాటుచేసిన విద్యార్థుల కోర్టు సముదాయాన్ని చూసి తిలకించారు.అదేవిధంగా ఎంఈఓ శంకరయ్య విద్యార్థులు చాలా చక్కగా ఆకట్టుకున్నారని విద్యార్థుల జీవితంలో ఇది మరువరాని రోజునని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీరాములు, ప్రధానోపాధ్యాయులు శివకుమారి, ఏవో శ్రీదేవి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.శ్రీ సాయి పాఠశాలలో మరియు శ్రీ నలంద పాఠశాలలో ప్రత్యేక వేషధారణలో విద్యార్థులుమండల కేంద్రమైన సిద్ధవటం గ్రామపంచాయతీలో శ్రీ సాయి పాఠశాలలో కరస్పాండెంట్ పోలు వెంకటసుబ్బయ్య , ప్రధానోపాధ్యాయులు రేవతి దేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.అలాగే శ్రీ నలంద పాఠశాలకు సంబంధించి కరస్పాండెంట్ బాలుగారి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో తమ విద్యార్థులకు వేషధారణ వేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ - విశాఖ లో ప్రారంభించిన పార్టీ నేతలు

విశాఖపట్నం విశాఖ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హస్తం పార్టీ సీనియర్ నేతల రాకతో కళకళలాడింది. ఇంటిం టా కాంగ్రెస్ పేరిట కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టా త్మకంగా చేపట్టిన హత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమాన్ని విశాఖలో ఆ పార్టీ అగ్రనేతలు ఘనంగా ప్రారంభించారు.గణతంత్ర్యదినోత్పవం సందర్బంగా విశాఖ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గోన్న పిసీసీ రుద్ర రాజు,తెలంగాణా సీనియర్ నేత ఉత్తం కుమార్ రెడ్డి జెండాను ఆవిష్కరిం చారు.దేశాన్ని బీజేపీ ప్రభుత్వం విచ్చి న్నం చేస్తున్న తరుణంలో దేశ సమగ్రత ను పరిక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఉద్య మ కార్యాచరణతో ముందుకు సాగు తోందని పిసీసీ రుద్రరాజు అన్నా రు. ఇంటింటా కాంగ్రెస్ హత్ సే హాత్ జోడో యాత్రను లాంచనంగా ప్రారంభిం చామని ఈ సందర్బంగా ప్రకటించా రు.ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షు లు రుద్ర రాజు, తెలంగాణ మాజీ పీసీసీ ప్రెసిడెంట్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్ర రావు, ఏఐసీసీ సెకరిటరీస్ క్రిస్టోఫర్ తిలక్ మేప్పాన్ సీటీ ప్రెసిడెంట్ గొంపగోవింద రాజు అధికార ప్రతినిధి వజ్జి పర్తి శ్రీనివాసరావు స్టేట్ బీసీ సెల్ చైర్మన్స్ మూలవేంకట రావు గుత్తుల శ్రీనివాసరావు ఏఐసీసీ సేవాదళ్ బామ్మి డి గంగాధర్ సుధాకర్ వెంకటరావు తదితర జిల్లా అధ్యక్షులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# గణతంత్ర భారతావనికి సమున్నత కీర్తి పెంపొందాలి..

**రాజ్యాంగ ఫలాలు అన్ని వర్గాలకు అందాలి..**

**నందికొట్కూరు లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు..**

నందికొట్కూరు. గణతంత్ర భారతావనికి సమున్నత కీర్తి పెంపొందాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని మున్సిపాలిటీ, మండల పరిషత్ కార్యాలయం,తహశీల్దార్ కార్యాలయం, వ్యవసాయ శాఖ, స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలు స్మరించుకున్నారు. నందికొట్కూరు మున్సిపాలిటీ లో చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ పి.కిషోర్, తహశీల్దార్ కార్యాలయం లో తహశీల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శోభారాణి, ఎంపీపీ మురళీ కృష్ణా రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏ విజయ శేఖర్, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ చంద్రమౌళి, సర్కిల్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో అర్బన్ సీఐ విజయభాస్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. సంధర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల కృషిపలితమే మనకు స్వాతంత్ర్యం , స్వాతంత్ర్య భారతం గణతంత్ర దేశంగా ఆవిర్భవించిందన్నారు.భిన్న మతాలు, భాషలు, సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయంగా మారిన భారత దేశ ప్రతిష్ఠతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకుంటూ, వారి ఆశయాలను , లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ మరింత బాద్యతగా పనిచేయాలన్నారు. భారత దేశాన్ని అగ్రగామి రాజ్యంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. జగన్ ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ,వాలంటరీ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాజ్యాంగ ఫలాలు అన్ని వర్గాలకు అందాలన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎందరో త్యాగమూర్తుల ఫలితంగా బ్రిటీష్ వారి పాలన నుండి భారతదేశానికి విముక్తి లభించిందని, ఆ మహానుభావులను ప్రతీ ఒక్కరు స్పూర్తిగా తీసుకోవాలని అన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగవ్యవస్థగా రూపొందించేందుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి, కౌన్సిలర్లు రాధిక, శాంతి కుమారి, మందాడి వాణి, విజయమ్మ , రూపదేవి, దేశెట్టి సుమలత, చాంద్ బాష, రావూఫ్, అబ్దుల్ హమీద్, బోయ జయమ్మ, మండల వ్యవసాయ అధికారి శ్రావణి, డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి, సత్యనారాయణ, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# రాచపూడి నాగభూషణం కళాశాలలో ఘనంగా గణతంత్ర వేడుకలు



బద్వేలు .శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ మరియు పీ.జి కళాశాలలో గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శాసన సభ్యులు గౌరవనీయులు డా!! సుధా మరియు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి మొదట ఎన్.సి.సి కేడెట్స్ చే గౌరవ వందనం స్వీకరించి అనంతరం జెండాను ఎగుర వేసి జెండా వందనం చేశారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే సుధా, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ...మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాము.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ వంటి ప్రముఖులు కమిటీగా ఏర్పడి, ఎన్నో ఇతర రాజ్యాంగాలను అధ్యయనం చేసి మన రాజ్యాంగాన్ని ఏర్పరిచారు. ఎంతో మంది వీరుల త్యాగ ఫలితం ఈ గణతంత్ర దినోత్సవమన్నారు.విద్యార్థులు మంచి శక్తివంతమైన పౌరులుగా ఎదిగి, జన్మించిన ప్రాంతానికి, మన దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చేలా ఎదగాలని సందేశం ఇచ్చారు.అంతేగాక కళాశాల నిర్వాహకులు శ్రీ రాచపూడి సాయి

**పాల్గొన్న బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి**

కృష్ణ గారు విద్యార్థులకు ఎన్.సి.సి తో కూడిన పటిష్టమైన విద్యనందిస్తూ, భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న తీరును వారు ప్రశంసించారరక్తదాన శిబిరం×ఈ సందర్భంగా కళాశాలలో ఎన్.సి.సి కేడెట్స్ మరియు ఎన్.యస్.యస్ విద్యార్థుల ఆధ్వర్యంలో, స్థానిక సీమాంక ప్రభుత్వ ఆసుపత్రి నేతృత్వంలో గొప్ప రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగినది.ఈ రక్తదాన శిబిరాన్ని గౌరవనీయులు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు.ఈ రక్తదాన శిబిరంలో ఎన్.సి.సి కేడేట్స్ 50 మంది పైగా రక్తదానం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానిక సీమాంక ప్రభుత్వ ఆసుపత్రి రక్త నిల్వ కేంద్రం వారు వారు రక్తమును సేకరించడం జరిగింది.కంప్యూటర్ వెబ్ డిజైనింగ్ ప్రదర్శన×కళాశాల తృతీయ సంవత్సరం బీయస్సీ కంప్యూటర్ విభాగ అధ్యాపకురాలు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు కోడింగ్ ద్వారా వెబ్ డిజైనింగ్ ప్రాజెక్ట్ ప్రదర్శన నిర్వహించారు. అతిథులు అధ్యాపకులు కంప్యూటర్ విభాగ విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించారు.వసంత పంచమి పూజా కార్యక్రమం×నేడు వసంత పంచమి పర్వదిన సందర్భంగా కళాశాల విద్యార్థినులు చదువుల తల్లి సరస్వతి దేవికి చక్కని పూజలు చేసి అతిథులకు,అధ్యాపకులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గౌరవనీయులు ఎమ్మెల్యే శ్రీమతి సుధా, మున్సిపల్ చైర్మన్ శ్రీ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ ఒ కళాశాల పరిపాలనాధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ , ప్రిన్సిపల్ సత్యనారాయణ, సీమాంక ప్రభుత్వ గైనకాలజిస్ట్ రామలక్ష్మి, కంప్యూటర్ అధ్యాపకురాలు లక్ష్మీదేవి, తెలుగు అధ్యాపకులు వి.వి.చలపతి, కళాశాల ఎన్.సి.సి సబ్ లెఫ్టినెంట్ జి.సుధాకర్ రెడ్డి, వై.వీరేంద్ర, అధ్యాపక బృందం, స్థానిక ప్రభుత్వ వైద్య సిబ్బంది స్వరూప్, బ్రహ్మయ్య తదితరులు మరియు కేడెట్స్ పాల్గొన్నారు.

# ఉత్తమ మండల సర్వేయర్ గా గాది లింగప్ప

**ప్రశంసా పత్రాన్ని అందజేసిన జిల్లా కలెక్టర్.**



తుగ్గలి: రిపబ్లిక్ డే ను పురస్కరించుకొని తుగ్గలి మండలంలో మండల సర్వేయర్ గా విధులు నిర్వహిస్తున్న గాదిలింగప్ప ను ఉత్తమ సర్వేయర్ గా జిల్లా ఉన్నతాధికారులు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా గురువారం రోజున రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు చేతుల మీదుగా ఉత్తమ మండల సర్వేయర్ గా ప్రశంసా పత్రాన్ని పొందారు. ఈ సందర్భంగా తుగ్గలి మండల తహాసిల్దార్ రవి,రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి,వీఆర్వోలు,విలేజ్ సర్వేయర్లు ఉత్తమ మండల సర్వేయర్ గా ఎంపికైన గాదిలింగప్ప కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ గాదిలింగప్ప మాట్లాడుతూ ఉత్తమ మండల సర్వేయర్ గా ఎంపిక చేసినందుకు ఉన్నత అధికారులకు, తుగ్గలి మండల రెవెన్యూ అధికారులకు మరియు కురువ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా 74 గణతంత్ర దినోత్సవం నారాయణ పాఠశాలలో జరుపుకున్నారు

ఎమ్మిగనూరు. ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక నారాయణ పాఠశాలలో 74 వ గణతంత్ర దినోత్సవాన్ని ఏజీఎం రమేష్ కుమార్ గారి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు ఇందులో విద్యార్థులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు వేషధారణలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి . అనంతరం ప్రిన్సిపల్ సురేష్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలుపరచిన రోజును గణతంత్ర దినోత్సవం గా జరుపుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ కొండలరావు ఏవో జాకీర్ హుస్సేన్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు



# 7సార్లు ఉత్తమ పురస్కారం అందుకున్న అరుదైన గౌరవం




**సబార్డినేట్ మొహమ్మద్ కు ఉత్తమ పురస్కారం అవార్డు**

**కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకోవడం చాల ఆనందం**

కౌతాళం మండల పరిధిలో హల్వి, కమవరం, ఉరుకుంద గ్రామంలో పశు వైద్య సేవలు సబార్డినేట్ మొహమ్మద్ గురువారం ఉత్తమ పురస్కారం అవార్డు లభించింది. గత ఏడు సంవత్సరాల నుంచి 7సార్లు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కార అందుకోవడం చాలా చాలా ఆనందకర విషయం అని నా సేవలు గుర్తించినందుకు సదా వారికి నేను రుణపడి ఉంటాను అని అతని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉత్తమ పురస్కారం అవార్డు జెడి రమణయ్య, ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదుగా సబార్డినేట్ మొహమ్మద్ అందుకున్నారు.

# ఆస్కార్ బరిలో 'చెలో షో' వైఫల్యానికి కారణం?



పాన్ నళిన్ తెరకెక్కించిన గుజరాతీ చిత్రం' చెలో షో' ఆస్కార్ 2023కి నామినేషన్ పొందుతుందని అంచనా వేసారు. కానీ నిరంతరం చర్చల్లో నిలిచిన ఈ చిత్రం ప్రతిష్టాత్మక అకాడమీ అవార్డుల నామినేషన్ జాబితాలోకి ప్రవేశించలేకపోయింది. ఈ వైఫల్యానికి కారణమేమిటో చిత్రబృందం వివరించాల్సి ఉంటుంది.ఆస్కార్ 2023 నామినేషన్లు జనవరి 24న సాయంత్రం 7 గంటలకు ప్రకటించిన సంగతి తెలిసిందే. ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రధాన కేటగిరీలలో అధికారిక ఆస్కార్ నామినీలను ఆవిష్కరించింది. అన్ని ఆశలు పాన్ నళిన్ తెరకెక్కించిన విమర్శకుల ప్రశంసలు పొందిన 'చెలో షో'పైనే ఉన్నాయి. కానీ చివరిలో ఊహించని ట్విస్టు. ఆస్కార్ ఫైనల్ లిస్ట్ లో చేరుతుందనుకున్న ఈ సినిమా చివరికి నిరాశపరిచింది. ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్-అవతార్: ది వే ఆఫ్ వాటర్-ఎల్విస్ సహా ఇతర చిత్రాలు ఉత్తమ చిత్రం విభాగాల్లో నామినేట్ కాగా భారతదేశం తరపున అధికారిక ఎంట్రీ 'చెలో షో' ఆ అరుదైన అవకాశాన్ని కోల్పోయింది.95వ ఆస్కార్ నామినేషన్ల ప్రక్రియ అకాడమీ శామ్యూల్ గోల్డ్ విన్ థియేటర్లో జరిగింది. ఆస్కార్-విజేత నటుడు కం నిర్మాత రిజ్ అహ్మద్ - అల్లిసన్ విలియమ్స్ ఆస్కార్ 2023 నామినేషన్ల ప్రకటించారు.పాన్ నళిన్ తెరకెక్కించిన 'చెలో షో' ఫలితం ఎలా ఉండబోతోంది? అంటూ ఎంతో ఆసక్తిగా చిత్రబృందం వేచి చూసింది. కానీ ఆ పేరు కనిపించలేదు వినిపించలేదు. నిజానికి భారతదేశం తరపున ఉత్తమ చిత్రం కేటగిరీలో నిలిచిన ఏకైక చిత్రమిది. కానీ తుది నామినేషన్ల పోరులో నెగ్గలేకపోయింది.చెలో షోకి ఎంచుకున్న కథాంశం ఆసక్తిని కలిగించేదే. తొమ్మిదేళ్ల కుర్రాడు సమయ్ సినీఅభిరుచి ఎలాంటిది.. అతడు అంత పేదరికంలోను తాను అనుకున్న లక్ష్యం వైపు ఎలా ప్రయాణించాడు అనే చిన్న కథను తెరపై హృద్యంగా తెరకెక్కించారు.దర్శకుడు నిజమైన అభిరుచితోనే ఈ సినిమాని తెరకెక్కించాడు. ప్రతిష్మాత్మక ఆస్కార్ గెలుచుకోవాలని కలలు కన్నాడు. కానీ అది నిజం కాలేదు. చరిత్రలో భారతదేశం నుంచి ఎన్నో సినిమాలు ఆస్కార్ తుది గడప వరకూ వెళ్లి వెనుదిరిగాయి. అమీర్ ఖాన్ 'లగాన్' నామినేషన్ అయ్యాక ఫైనల్ లో వేరొక అమెరికన్ చిత్రానికి ఆస్కార్ ని కోల్పోయింది. ఇంకా ఎన్నో ఇలాంటి అనుభవాలు భారతీయ చలనచిత్ర పరిశ్రమకు కొత్తేమీ కాదు.చెలో షో చిత్రం 10 జూన్ 2021న థియేట్రికల్ గా విడుదలైంది. భవిన్ రబారి- భవేష్ శ్రీమాలి- రిచా మీనా- దిపెన్ రావల్ సహా పలువురు ప్రతిభావంతులైన కళాకారులు ముఖ్యమైన పాత్రల్లో నటించారు. సినిమా విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. కానీ ఆస్కార్ పోరు నుంచి నిష్క్రమించింది. అయితే మార్చిలో ఆస్కార్ లు అందుకునే జాబితాలో ఆర్.ఆర్.ఆర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈ చిత్రం నుంచి నాటు నాటు పాట ఉత్తమ గీతం కేటగిరీలో నామినేషన్ పొందడమే దీనికి కారణం.చెలో షో నిర్మాతలు ఆస్కార్ పోరులో ప్రచారం నిర్వహించేందుకు వెచ్చించలేని సన్నివే శాన్ని కూడా అర్థం చేసుకోవాలి ఆర్.ఆర్.ఆర్ కి గ్లోబల్ వరల్డ్ లో దక్కిన ప్రచారం చిన్న సినిమా అయిన 'చెలో షో'కి దక్కలేదన్నది వా స్తవం.కేవలం సినిమాలో కంటె ంట్ దమ్ము ఉంటే సరిపోదు. ప్రచారపు ఎత్తుగడలు.. ప్రముఖులతో ఇంటరాక్షన్ లు ప్రపంచం దృష్టికి తమ సినిమాని తీసుకెళ్లే విధానం ఇవన్నీ కూడా ఆస్కార్ రేసులో ఫలి తాల ను తారుమారు చేస్తుం టాయన్నది అం దరికీ తెలిసిన నిర్వి వాదాంశం.




# కింగ్ ఖాన్ ఈజ్ బ్యాక్.. కంటెంటే అల్టిమేట్!

కంటెంట్ ఈజ్ కింగ్ అని మరోసారి నిరూపితం అయింది దాదాపుగా పదేళ్ల నుంచి సరైన హిట్ లేక ఇబ్బంది పడుతున్న కింగ్ షారుఖ్ ఖాన్ అభిమానులకు పఠాన్ రూపంలో ఒక బంపర్ బొనాంజా తగిలింది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో షారుక్ ఖాన్ హీరోగా దీపికా పదుకొనే హీరోయిన్ గా తెరకెక్కిన పఠాన్ సినిమా ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున విడుదలైన సంగతి తెలిసిందే.జాన్ అబ్రహం ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని యష్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్ మీద ఆదిత్య చోప్రా నిర్మించారు. ఇక ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా తెలుగు సహా హిందీ తమిళ భాషల్లో విడుదలవగా ఈ సినిమా ఆద్యంతం ఆకట్టుకునే విధంగా సాగిందని అంటున్నారు.దీంతో చాలా కాలంగా సరైన హిట్ లేక ఇబ్బంది పడుతున్న బాలీవుడ్ కి సైతం ఒక బంపర్ హిట్ దొరికినట్లుగా అందరూ భావిస్తున్నారు. ఈ సినిమాలో షారుక్ ఖాన్ ఒక రా ఏజెంట్ పాత్రలో కనిపించాడని అంటున్నారు.అయితే ఈ సినిమా రిలీజ్ అవ్వకముందే సినిమాని బాయ్ కాట్ చేయాలని బ్యాన్ చేయాలని పెద్ద ఎత్తున హిందూ సంఘాల నుంచి అనేక నిరసనలు వెల్లువెత్తాయి. సినిమా బ్యాన్ అవుతుంది అంటూ కూడా ప్రచారాలు జరిగాయి.అయితే సినిమా విడుదలైన తర్వాత సినిమా ప్రేక్షకులందరికీ విపరీతంగా నచ్చడంతో అందరూ సినిమా చూసేందుకు థియేటర్లకు క్యూ కడుతున్నారు.



ఈ దెబ్బతో సినిమా కంటెంట్ ఉంటే ఎన్ని బాయ్ కాట్ ఉద్యమాలు జరిగినా ఎలాంటి ఉపయోగం లేదనే విషయం నిరూపితమైందని అంటున్నారు విశ్లేషకులు.మొత్తం మీద బాలీవుడ్ కూడా చాలా కాలం నుండి సరైన హిట్ లేక ఇబ్బంది పడుతోంది. సౌత్ సినిమా బాలీవుడ్ డామినేట్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు ఒక హిట్టు అందుకోవడం అనేది ఇప్పుడు బాలీవుడ్ వర్గాలకు కాస్త ఊపిరి సలుపుకునేలా చేసిందని చెప్పచ్చు.మొత్తం మీద బాలీవుడ్ వారంతా ఇప్పుడు కింగ్ ఖాన్ సినిమా గురించే మాట్లాడుకుంటున్నారు.

# పృథ్వీ షాకు లైన్ క్లియర్, తుది జట్టు ఇలా ఉంటుంది..!



యువ ఓపెనర్ పృథ్వీ షాకు దాదాపు ఏడాదిన్నర తర్వాత టీమిండియాకు ఆడే అవకాశం లభించనుంది. కివీస్‌తో టీ20 సిరీస్‌కు ముందు మరో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ గాయం బారిన పడటంతో షాకు తుది జట్టులో స్థానం లభించడం దాదాపుగా ఖరారైంది.షా చివరిసారిగా 2021 జులైలో శ్రీలంకతో టీ20 మ్యాచ్ ఆడాడు. షా అంతర్జాతీయ స్థాయిలో ఆడిన ఏకైక టీ20 మ్యాచ్ ఇదే. ఆ మ్యాచ్‌లో షా తొలి బంతికే గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగాడు.ఇటీవల ఓ రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో భారీ ట్రిపుల్ సెంచరీ బాదడం ద్వారా సెలెక్టర్ల దృష్టిని ఆకర్శించిన షా.. రేపు (జనవరి 27) రాంచీ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగబోయే తొలి వన్డేలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. ఈ మ్యాచ్‌లో భారత తుది జట్టు కూర్పు విషయానికొస్తే.. షాతో పాటు మరో ఓపెనర్‌గా భీకర ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్ బరిలోకి దిగే అవకాశం ఉంది.వన్‌డౌన్‌లో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో సూర్యకుమార్ యాదవ్, ఆతర్వాత దీపక్ హుడా, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, శివమ్ మావీ, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, ఉమ్రాన్ మాలిక్ బరిలోకి దిగడం దాదాపుగా ఖరారైనట్టే. ఒకవేళ లెఫ్ట్ అండ్ రైట్ ఓపెనింగ్ కాంబినేషన్ ఉంటే బాగుంటుందని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తే.. షా స్థానంలో ఇషాన్, వన్ డౌన్‌లో షా వచ్చే అవకాశాలు కూడా లేకపోలేదు. అయితే, ఈ ప్రయోగకర సమీకరణను ట్రై చేసే సాహసం టీమిండియా యాజమాన్యం చేయకపోవచ్చు.కాగా, భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య రేపు రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే తొలి టీ20లో గెలుపే లక్ష్యంగా ఇరు జట్లు బరిలోకి దిగనున్నాయి. తాజాగా ముగిసిన 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన జోష్‌లో టీమిండియా ఉండగా.. టీ20 సిరీస్‌నైనా కైవసం చేసుకుని ప్రతీకారం తీర్చుకోవాలని పర్యాటక జట్టు పట్టుదలగా ఉంది. ఈ సిరీస్‌లో మిగతా మ్యాచ్‌లు జనవరి 29, ఫిబ్రవరి 1న జరుగనున్నాయి. రెండో టీ20 లక్నో వేదికగా, మూడో మ్యాచ్ అహ్మదాబాద్ వేదికగా జరుగనున్నాయి.న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌ను భారత జట్టు..హార్దిక్ పాండ్యా (కెప్టెన్), సూర్యకుమార్ యాదవ్ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్‌కీపర్), జితేశ్ శర్మ (వికెట్‌కీపర్), శుభ్‌మన్ గిల్, పృథ్వీ షా, రాహుల్ త్రిపాఠి, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, శివమ్ మావీ, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, ఉమ్రాన్ మాలిక్, యుజ్వేంద్ర చహల్, ముకేశ్ కుమార్న్యూజిలాండ్ జట్టు..మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), మైఖేల్ బ్రేస్‌వెల్, డారల్ మిచెల్, మైఖేల్ రిప్పన్, మార్క్ చాప్‌మన్, ఫిన్ అలెన్, డెవాన్ కాన్వే, డేన్ క్లీవర్, గ్లెన్ ఫిలిప్స్, జాకబ్ డఫ్ఫీ, బెన్ లిస్టర్, ఇష్ సోధీ, లోకీ ఫెర్గూసన్, హెన్రీ షిప్లే, బ్లెయిర్ టిక్నర్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190